
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వార్తలు

గురువారం 27 నవంబరు 2025

డెల్టాకు 10,150 క్యూసెక్కుల నీరు సరఫరా

అనంతసాగరం నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయానికి బుధవారం 14,826 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. దీంతో ప్రాజెక్టులో 73.054 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ ఉత్తర కాలువకు 400, డెల్టాకు 10,150, కండలేరుకు 2,200 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

4వేల బస్తాల బియ్యం బొక్కేశారు!


- ఎంఎల్ఎస్ గోదాములో అధికారుల బృందం తనిఖీలు

8 లో..

ఆనందం

- మూడున్నరేళ్ల నిరీక్షణకు తెర
- తిరిగి ప్రకాశంలోకి కందుకూరు
- అన్నివర్గాల ప్రజల్లో హర్షం





కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కందుకూరు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తీసుకున్న నిర్ణయం పట్ల అన్ని వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. నాటి వైసీపీ సర్కారు కేవలం 45 కి.మీ దూరంలో ఉన్న ప్రకాశం జిల్లా నుంచి తప్పించి 120 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరులో కలిపారు. 2022, ఏప్రిల్ 4న అప్పటి వైసీపీ ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ ఇవ్వగా అన్ని పార్టీలు, ప్రజాసంఘాల నేతృత్వంలో భారీస్థాయిలో ఆందోళనలు జరిగాయి. కానీ ఇవేమీ నాటి పాలకులు పట్టించుకోకుండా నెల్లూరులో విలీనం చేసేశారు. దీంతో రాష్ట్రంలో రెండవ అతిపెద్ద రెవెన్యూ డివిజన్‌గా 24 మండలాలతో భాసిల్లిన కందుకూరు డివిజన్ కేవలం 7 మండలాలతో డివిజన్‌గా మారి చావుతప్పి కన్నులొట్టపోయినట్టు అయ్యింది. అనేక డివిజన్‌స్థాయి కార్యాలయాలు కందుకూరు నుంచి ఇతర డివిజన్లకు తరలిపోయాయి.

● మాట నిలబెట్టుకున్న చంద్రబాబు, లోకేష్

యువగళం పాదయాత్రలో భాగంగా కందుకూరుకు వచ్చిన టీడీపీ యువనేత నారా లోకేష్‌కు నియోజకవర్గ ప్రజలు తమ ప్రధాన ఆకాంక్షను తెలపగా టీడీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తామని తెలిపారు. అదేవిధంగా ఎన్నికల ప్రచారంలో భాగంగా కందుకూరు వచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సైతం ఈ హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం కందుకూరును ప్రకాశంలో కలిపేందుకు తుదినిర్ణయం తీసుకోవటం పట్ల ప్రజలు హర్షిస్తున్నారు.

● పూర్వవైభవం వచ్చేలా చూడాలి

కందుకూరును మళ్లీ ఏడు మండలాలకే పరిమితం చేస్తుండటం పట్ల ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. నెల్లూరులో విలీనం అయ్యాక కందుకూరు డివిజన్‌లో కలిపిన కొండాపురం, వరికుంటపాడు మండలాలను తప్పించి వాటిస్థానంలో కొండపి నియోజకవర్గంలోని పొన్నలూరు, మర్రిపూడి మండలాలను కలుపుతూ నిర్ణయం తీసుకోవటంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. కందుకూరులోని 5 మండలాలతోపాటు కొండపి నియోజకవర్గంలోని ఐదు మండలాలను కూడా కందుకూరులో విలీనం చేయటం ద్వారా ఇక్కడ నుంచి తరలిపోయిన డివిజన్ కార్యాలయాలు తిరిగి కందుకూరుకు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుకుంటున్నారు.

మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు కందుకూరు నియోజకవర్గ వాసుల్లో ఆనందం నింపగా, కలువాయి, రాపూరు, సైదాపురం మండలాల వాసుల్లో ఆగ్రహం తెప్పించింది. ఈ మూడు మండలాలను నెల్లూరులోనే ఉంచాలని కోరుతున్నారు.

ప్రజల ఆందోళనలు ఫలించాయి



మూడున్నర సంవత్సరాలుగా తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుదూరంగా ఉన్న నెల్లూరు చుట్టూ తిరగలేక ప్రజలు అల్లాడిపోవటంతో పాటు జిల్లా కేంద్రానికి సుదూరంగా ఉన్న కందుకూరుకు వచ్చేందుకు ఉద్యోగులు కూడా ఇష్టపడని పరిస్థితుల్లో ఎన్నో ఇబ్బందులు పడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ఇచ్చిన మాటకు కట్టుబడి కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేస్తూ తీసుకున్న నిర్ణయం వల్ల ఈ ప్రాంత ప్రజల్లో వారి పట్ల గౌరవం పెరిగింది.

- పాలేటి కోటేశ్వరరావు, మాలసంఘాల జేఏసీ రాష్ట్ర నాయకుడు

ప్రజలు ధన్యవాదాలు తెలుపుతున్నారు!



పాదయాత్రలో యువనేత నారా లోకేష్, ఎన్నికల ప్రచారసభలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా చంద్రబాబు కందుకూరును ప్రకాశం జిల్లాలోనే విలీనం చేయాలని మంత్రుల కమిటీకి సూచన చేయటంతో మనకు మేలుజరిగే నిర్ణయం జరిగింది. ఈ నిర్ణయంతో కూటమి ప్రభుత్వానికి నియోజకవర్గ ప్రజలు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలుపుతున్నారు.

- శ్రీనివాసులు, టీడీపీ నాయకుడు, కరేడు, ఉలవపాడు మండలం

ఆగ్రహం

రాపూరుపై మిశ్రమ స్పందన

రాపూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాల పునర్విభజనలో భాగంగా రాపూరు మండలాన్ని తిరుపతి జిల్లాలో విలీనం చేసేందుకు ప్రభుత్వం ఆమోద ముద్ర వేయడంపై మండల వాసుల నుంచి మిశ్రమ స్పందన వస్తోంది. వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్న రాపూరును నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని కొందరు, తిరుపతి జిల్లాలో కలిస్తే మేలని ఇంకొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో రాపూరు, కలువాయి, సైదాపురం మండలాలకు నష్టం జరిగిందని ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసన దీక్షలు చేపట్టారు. దీంతో అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణ రెడ్డి కూడా మద్దతు తెలపడంతో - మిగతా 6వ పేజీలో...

తిరుపతి ఎక్కడ.. కలువాయి ఎక్కడ?




కలువాయి మండలాన్ని 70 కి.మీ దూరంలో ఉన్న నెల్లూరు నుంచి తొలగించి 140 కి.మీ దురాన ఉన్న తిరుపతిలో కలపడం ప్రజలకు చాలా అసౌకర్యం. అలాగే 41 కిలోమీటర్లలో ఉన్న ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ మార్చి 80 కిలోమీటర్ల దూరంలో ఉన్న గూడూరులో కలపడం ఎంత వరకు న్యాయం. కలువాయి నుంచి తిరుపతికి వెళ్లి రావాలన్నా ఆర్థిక భారంతో పాటు రాత్రికి ఇంటికి చేరే పరిస్థితి ఉండదు.

- నాగిరెడ్డి రాజారెడ్డి, కలువాయి సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు

అంత దూరం కష్టమబ్బా!

కలువాయి టు తిరుపతి 140 కి.మీ
డివిజన్ కేంద్రానికీ పెరగనున్న దూరం
వ్యతిరేకిస్తున్న మండలవాసులు

కలువాయి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలు, డివిజన్ల పునర్విభజనలో భాగంగా కలువాయి మండలాన్ని గూడూరు రెవెన్యూ డివిజన్‌లోకి, తిరుపతి జిల్లా పరిధిలోకి తీసుకెళుతూ మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు చేసింది. అయితే, ఈ ప్రతిపాదనపై మండల వాసులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటివరకు ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో కలువాయి ఉండగా డివిజన్ కేంద్రానికి 45 కి.మీ దూరం ఉంది. అయితే, మండల కేంద్రం నుంచి గూడూరుకు 80 కి.మీ ఉంటుంది. అలాగే ప్రస్తుతం జిల్లా కేంద్రం నెల్లూరుకు 70 కి.మీ దూరం ఉంది. తిరుపతి జిల్లాకు మారిస్తే 140 కి.మీ దూరం పెరుగుతుంది. దగ్గర ఉన్న రెవెన్యూ డివిజన్, జిల్లా కేంద్రాన్ని దూరంగా మార్పు చేస్తే వ్యయప్రయాసలు పడాల్సి వస్తుందని మండల వాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో ఉన్న కలువాయి మండలాన్ని గత వైసీపీ హయాంలోనే - మిగతా 6వ పేజీలో...





పొదలకూరు : డేగపూడి వద్ద బేస్‌మెంట్ దశలోనే హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం

ఏడాదిలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పూర్తి

- రాష్ట్ర ప్రభుత్వ కార్యాచరణ
- రూ. 12.91 కోట్లు విడుదల

విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు సొంత భవనాల నిర్మాణం ఒక కొలిక్కి వస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో అసంపూర్తిగా, అసలు నిర్మాణానికే నోచుకోని వాటిని ఏడాదిలోపు పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా రూ. 12.91 కోట్ల నిధులు కూడా విడుదల చేసింది. ఈ నేపథ్యంలో పెండింగ్ భవనాలను పూర్తి చేసేందుకు పంచాయతీరాజ్ శాఖ టెండర్లు పిలుస్తోంది. ఇప్పటికే కొన్ని టెండర్లు ఖరారయ్యాయి. ఈ క్రమంలో హెల్త్ క్లినిక్‌లకు పట్టిన గ్రహణం వీడనుంచి.

వివరాలు 8లో...

ఎవరా ఇద్దరు.. ఎందుకు చంపేశారు!?

ఇరవై ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ అందరి మన్ననలు అందుకుంటున్న జలదంకి మండలం చింతలపాలెంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (58) బుధవారం హత్యకు గురవడం తీవ్ర కలకలం రేపింది. ఉదయం తన కోళ్లఫారంలో ఉన్న ప్రసాద్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ఆరుచోట్ల విచక్షణారహితంగా కత్తులతో పొడిచి హతమార్చారు. కోళ్ల కొనుగోళ్లకు వచ్చిన ఇద్దరు వ్యక్తులే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దుండగుల కోసం ప్రత్యేక పోలీసు బృందాలు గాలిస్తున్నాయి. ప్రసాద్‌నాయుడు హత్య బయట వ్యక్తుల పనేనని కావలి డీఎస్పీ శ్రీధర్ స్పష్టం చేశారు. ఇది రాజకీయ హత్య కాదని, వ్యక్తిగత హత్యగా భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారించి నిందితులను పట్టుకుంటామని ఆయన స్పష్టం చేశారు.



గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (ఫైల్)

- చింతలపాలెంలో టీడీపీ నేత దారుణ హత్య
- కోళ్లఫారంలో కత్తులతో పొడిచి హతమార్చిన ఆగంతుకులు
- పోలీసుల ముమ్మర దర్యాప్తు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు
- రాజకీయాలకు సంబంధం లేదు : డీఎస్పీ
- వ్యక్తిగత కారణాలపై ఆరా తీస్తున్నాం

పూర్తి వివరాలు 8లో...



సంగంలో పందడుగులు జాతీయ జెండా ప్రదర్శన

రాజ్యాంగమే మనకు రక్ష

ఘనంగా భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం

భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జిల్లాఅంతటా బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, రాజకీయ పార్టీల ఆఫీసుల్లో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు నివాళులర్పించారు. రాజ్యాంగం ద్వారా సంక్రమించిన హక్కులు, రాజ్యాంగం కల్పించే రక్షణపై ప్రముఖులు, న్యాయ నిపుణులు అవగాహన కల్పించారు. కాగా, రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పాఠశాలల్లో విద్యార్థులు నిర్వహించిన మాక్ పార్లమెంటు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.



నెల్లూరులో ర్యాలీ

ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి మాపై కక్ష గట్టారు!

- ఏమైనా ఉంటే నేరుగా ఎదుర్కోండి
- మేయర్ పదవిపై రూప్ కుమార్ కన్నేశాడు!
- మేయర్ స్రవంతి దంపతులు

నెల్లూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరురూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తమపై కక్షగట్టారని మేయర్ స్రవంతి దంపతులు ఆరోపించారు. బుధవారం కార్పొరేషన్‌లోని తన చాంబరులో వారు విలేకరులతో మాట్లాడారు. ఒకటిన్నర ఏడాదిగా తమ పై అనేక రూపాల్లో కక్ష సాధింపునకు పాల్పడుతున్నారని తెలిపారు. అవిశ్వాసం తీర్మానం ప్రవేశపెట్టేందుకు కార్పొరేటర్లతో జేసీకి ఫిర్యాదు చేయించారని, ఆ మేరకు తమ గిరిజన నాయకులు అంబేడ్కర్ విగ్రహానికి వినతి ఇచ్చేందుకు మంగళవారం వీఆర్సీ కూడలి వద్దకు వెళ్లారన్నారు. అక్కడికి కూడా తన మనుషులను పంపి తమ వద్ద ఉండే యువకులను బెదిరింపులకు పాల్పడ్డారన్నారు. సిరాజ్ అనే యువకుడి ఇంటికి పోలీసులను, అనుచరులను పంపి భయభ్రాంతులకు - మిగతా 7వ పేజీలో...



తన వద్ద ఫైల్స్ నమోదు వివరాలు చూపుతున్న మేయర్ స్రవంతి, పక్కనే ఆమె భర్త జయవర్ధన్

ఏం చేద్దాం!

ప్చ్... పరిస్థితులు తారుమారు అయ్యాయి. నాలుగేళ్ల పదవీ కాలం పూర్తయిన నాటినుంచి మేయర్‌ని గద్దె దింపేందుకు అధికార పార్టీలో జరుగుతున్న దూకుడుతో పోట్లూరి స్రవంతి అనుచరులు తలలుపట్టుకుంటున్నారు. కార్పొరేటర్ల ఫిర్యాదుతో పదవిని కోల్పోతే అధికార దర్పం ఎలా? కార్పొరేషన్ నుంచి రావాల్సిన బిల్లులు సంగతేంటి? ఇప్పటివరకు పెట్టిన పెట్టుబడులు ఎలా వస్తాయి? అంటూ ఆందోళన చెందుతున్నారు. మరోవైపు సొంత పార్టీ పెద్దలే స్రవంతితో తమకు ఎలాంటి సంబంధం లేదని తేల్చేశారు. ఇటు ఆమెను పదవి నుంచి దించేయాల్సిందేనని టీడీపీ పట్టుపట్టుకు కూర్చుంది. దీంతో నెల్లూరు నగరపాలక సంస్థ రాజకీయం ఆసక్తికరంగా మారింది.

- మేయర్ కుర్చీ వీడాల్సిందేనా!?
- అంతర్మథనంలో స్రవంతి అనుచరగణం
- అందరి చూపు అవిశ్వాసంపైనే!
- ఆసక్తి రేపుతున్న నెల్లూరు రాజకీయం

నెల్లూరు (సిటీ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సరిగ్గా నాలుగేళ్ల క్రితం మేయర్ కుర్చీపై అధిష్ఠించిన స్రవంతి మూడున్నరేళ్లపాటు సిటీ నియోజకవర్గం వైపు కన్నెత్తి చూడలేదు. వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న అనిల్ కుమార్ యాదవ్ ఆమెను సిటీలోకి అనుమతించలేదు. దీంతో రూరల్‌కే పరిమితమయ్యారు. రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి అభివృద్ధి కార్యక్రమాల్లో మేయర్‌ను భాగస్వామిని చేసి ప్రాధాన్యత ఇచ్చారు. కొన్నాళ్లకి భవన నిర్మాణ అనుమతుల్లో జోక్యం పెరగడంతో ఆమెతోపాటు ఆమె భర్త ను దూరంపెట్టారు. అనంతరం సార్వత్రిక ఎన్నికల వేళ ఎమ్మెల్యే టీడీపీలోకి వచ్చాక మేయర్ వైసీపీలోనే ఉన్నారు. సిటీప్లానింగ్ విభాగాన్ని అదుపులోకి తెచ్చుకున్న ఆమె భర్త జయవర్ధన్ మార్టిగేజ్ విడుదల్లో ఐఏఎస్ అధికారుల సంతకాలను ఫోర్జరీ చేసినట్లు బలమైన ఆరోపణలు ఎదుర్కొని జైలుపాలయ్యారు. ఆ పిదప మరో ఐఏఎస్ అధికారి సీసీని గదిలో బంధించి మరోమారు జైలు జీవితం అనుభవించారు. ఇలా అనేక ఆరోపణలు చవిచూసిన మేయర్ రాజకీయంగా ఒక్కొక్కరి మద్దతుకు దూరమవుతూ వచ్చారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వైసీపీకి రాజీనామా చేశారు. తదుపరి టీడీపీలోకి రావాలని ఆశించినా కుదరలేదు. దీంతో పాటు డిప్యూటీ మేయర్ ఎన్నిక విషయంలోనూ గౌర్హాజరవడం వైసీపీ నాయకులకు కోపం తెప్పించింది. ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం అదే పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి స్రవంతికి తమ పార్టీకి ఎలాంటి సంబంధం లేదని అధికారికంగా తేల్చేశారు. దీంతో ఆమె ప్రస్తుతం రాజకీయంగా ఒంటరి అయ్యారు.



● చుట్టూ అవినీతి ఆరోపణలు

మేయర్‌గా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి స్రవంతి చుట్టూ అవినీతి ఆరోపణలు తిరుగుతూనే ఉన్నాయి. కార్పొరేషన్ బడ్జెట్‌లో పేషీ ఖర్చుల పేరిట రూ. లక్షలు డ్రా చేస్తున్నట్లు చూపుతున్న ఆమె ఆ మేరకు లెక్కలు చూపకపోవడం కార్పొరేటర్ల మధ్య తుకూ దూరమైంది. కాగ కార్పొరేషన్ ఆమె కారుకు ప్రతీ నెల రూ.60 వేలు చెల్లిస్తోంది. డ్రైవర్, డీజిల్ ఖర్చులకు అందులోనే వాడుకోవాలి. కానీ ఆమె కార్పొరేషన్ డ్రైవర్లతోపాటు, డీజిల్ ఎన్ఎంసీ పెట్రోల్ బంకుల నుంచి వాడుతున్నట్లు కార్పొరేటర్లు చెబుతున్నారు. దీనిపై ఆరోపణలు గుప్పుమన్నా ఒక్కసారి కూడా వివరణ ఇవ్వకపోవడం విశేషం. కౌన్సిల్, బడ్జెట్ సమావేశాల్లో భోజన, టిఫిన్ ఖర్చుల పేరిట రూ. లక్షలు బిల్లులను అత్యధిక రేట్లు చూపి ఆమె అనుచర దళం డ్రా చేశారన్న ఆరోపణలున్నాయి. పదోతరగతి విద్యార్థులకు మున్సిపల్ స్కూళ్లలో టిఫిన్ పెట్టిన క్రమంలో వాస్తవాలకు దూరంగా రూ.లక్షల బిల్లులు పెట్టారు. ఇందులోనూ బలమైన - మిగతా 7వ పేజీలో...



నోరు అదుపులో పెట్టుకో జయవర్ధన్!

- రోడ్డుపై తిరిగే మిమ్మల్ని మేయర్‌ను చేయలేదా!?
- ఇష్టానుసారం మాట్లాడితే నాలుక కోస్తాం
- టీడీపీ నాయకుల ధ్వజం

నెల్లూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : 'జయవర్ధన్... నోరు అదుపులో పెట్టుకో.. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని ఏకవచనంతో మాట్లాడితే నాలుక కోస్తాం..' అంటూ నెల్లూరురూరల్ టీడీపీ నాయకులు మేయర్ దంపతులపై ధ్వజమెత్తారు. బుధవారం నెల్లూరులోని రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో నాయకులు మదన్‌కుమార్‌రెడ్డి, అరవ శ్రీను, సాబీర్‌ఖాన్, నాగమణి తదితరులు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డిని నమ్ముకుని ఉన్నారన్న ఒకే ఒక్కకారణంతో రోడ్డు మీద తిరిగే మిమ్మల్ని తీసుకువచ్చి మేయర్‌ను చేసింది కోటంరెడ్డి సోదరులు కాదా...? అని ప్రశ్నించారు. మరోసారి అలా మాట్లాడితే నాలుక కోస్తామని హెచ్చరించారు. ఐఏఎస్ అధికారుల సంతకాలు ఫోర్జరీ చేసి రూ.కోట్ల ప్రజాధనం దారిమళ్లించిన కేసులో, మరో ఐఏఎస్ అధికారి సీసీని కొట్టిన కేసులో జైలుకు వెళ్లావే తప్ప ఎమ్మెల్యే ప్రమేయం ఇందులో ఏమి లేదన్నారు. రూపాయి ఖర్చులేకుండా కార్పొరేటర్‌ను చేసి ఆపై మేయర్‌గా మీ భార్యకు అవకాశం ఇచ్చిన కోటంరెడ్డి సోదరులను దుయ్యపట్టడం మానుకోకపోతే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని స్పష్టం చేశారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

కాంగ్రెస్ నాయకుడు జయప్రకాశ్ రెడ్డి మృతి

కోవూరు, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కాపు వీధికి చెందిన జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతా జయప్రకాశ్‌రెడ్డి (80) అనారోగ్యంతో మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన బెంగళూరులో చికిత్స పొందుతున్నారు. ఆరోగ్య పరిస్థితి విషమించడంతో ఆయనను కోవూరు కు తీసుకురాగా, బుధవారం ఉదయం మృతి చెందారు. మృతదేహానికి కుటుంబసభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. పలువురు నాయకులు ఆయన మృతదేహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12077
వెండి కిలో ధర	రూ. 163600
వెండి ఒక గ్రాము	రూ. 168.60

పర్యావరణాన్ని కాపాడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీహరిరెడ్డి

కోవూరు, నవంబరు 26, (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గ్రామాల్లో పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని ఎంపీడీఓ శ్రీహరిరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఆయన పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. పంచాయతీల్లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టాలన్నారు. ప్రభుత్వం ఈ పథకానికి ఎంతో ప్రాధాన్యతనిస్తోందన్నారు. కార్యదర్శులు గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. పరిశుభ్రతకు చర్యలు తీసుకోని పంచాయతీ కార్యదర్శులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈఓపీఆర్డీ ఉష, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంఈవోగా నరేష్‌కుమార్


ఎంఈవోని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మనుబోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలానికి కొత్త విద్యాశాఖాధికారిగా నరేష్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు మండలానికి ఇన్‌చార్జి ఎంఈవోగా ఉన్న ఓబులు మైపాడ్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా తిరిగి వెళ్ళారు. ఓబులు కొత్త ఎంఈవోని విశ్రాంత ఎంఈవో శేషాద్రివాసు, ఉపాధ్యాయులు, సిబ్బంది సత్కరించారు. స్థానిక చంద్రమౌళీ నగర్ గిరిజన కాలనీ మోడల్ స్కూల్‌ను ఎంఈవో తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పిల్లల అభ్యసన సామర్థ్యాన్ని పరిశీలించారు.

నేటినుంచి గ్రామసభలు

మనుబోలు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గడిచిన ఆర్థిక సంవత్సరం అనగా 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వరకు మండలంలో ఉపాధిహామి పథకం కింద చేసిన పనులకు సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఆర్‌పి రవి బుధవారం తెలిపారు. ఒక్కో గ్రామ పంచాయతీలో 3రోజుల పాటు తనిఖీలు చేయడం, మరుసటి రోజు ఆ గ్రామంలోని సచివాలయంలో కాని, పంచాయతీ కార్యాలయంలో కాని గ్రామసభ నిర్వహిస్తున్నామన్నారు. కూలీలకు ఇబ్బందులు జరిగి ఉంటే ఫిర్యాదు చేయాలన్నారు.

వామ్మో.. బుచ్చి- రాజుపాళెం రోడ్డా..?

అడుగడుగునా గోతులు.. అవస్థల్లో ప్రయాణికులు

ప్రమాదాలకు గురవుతున్న వాహన చోదకులు


గోతుల్లో రబ్బీష్ వేసిన ట్రాక్టర్ల నిర్వాహకులు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరెడ్డిపాళెం- రాజుపాళెం రోడ్డుపై ప్రయాణం నరకప్రాయంగా మారిందని వాహనచోదకులు వాపోతున్నారు. నిత్యం ప్రమాదాలకు ఈ రోడ్డు నిలయంగా మారింది. గత ఏడేళ్ళుగా ఈ మార్గంలో 2 అడుగులకు పైగా గోతులు పడ్డాయి. సుమారు 10 కిలోమీటర్లు పొడవునా గుంతలమయమే. ఆర్అండ్‌బీ అధికారులు కనీస మరమ్మతులు చేపట్టిన పాపాన పోలేదని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు.

జాతీయ రహదారికి వెళ్లాలంటే ఇదే దారి..

నిత్యం పొదలకూరు, నెల్లూరు రూరల్ మండలాలు, కడప వైపు నుంచి, రాజుపాళెం రోడ్డు మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాజుపాళెం దగ్గర్నుంచి జాతీయ రహదారి మీదుగా కావలి, ఒంగోలు, విజయవాడ తదితర ప్రాంతాలకు వాహనదారులు, రేయింబవళ్లు ప్రయాణాలు సాగిస్తుంటారు. అయినా ఈ రోడ్డు మరమ్మతులకు నోచుకోకపోవడం ప్రయాణీకులకు శాపంగా మారింది.

బుచ్చి నుంచి ఊటుకూరు వరకు బీటీ రోడ్డు

బుచ్చి- రాజుపాళెం రోడ్డు దుస్థితిపై కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రత్యేక చొరవతో బుచ్చి నుంచి విడవలూరు మండలం ఊటుకూరు వరకు రూ. 8 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఈ మేరకు త్వరలో టెండరు కూడా నిర్వహించనున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఏఈని వివరణ కోరగా బుచ్చి నుంచి ఊటుకూరు వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రెండు రోజుల్లో టెండర్లు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఏళ్ళ తరబడి ఇదే దుస్థితి!

ఏళ్ళ తరబడి బుచ్చి, రాజుపాళెం రోడ్డు ప్రమాదాలకు నిలయంగా తయారైనా సంబంధిత అధికారులు ఒక్కరూ పట్టించుకోలేదు. గత ప్రభుత్వంలో నెల్లూరు రూరల్, బుచ్చి, సంగం, ఆత్మకూరు మండలాల్లో పెన్నా పరీవాహక ప్రాంతాల్లోని ఇసుక రీచ్‌లనుంచి ఏడాది క్రితం వరకు నిత్యం టిప్పర్లు, ట్రాక్టర్లు ఈ మార్గంలో వెళ్లేవి. 5 టన్నుల నుంచి 80 టన్నుల మేర అధికలోడుతో సాగిన ఇసుక అక్రమ రవాణా దాటికి రోడ్డు అడుగుకో గుంత లెక్కన అధ్వాన్నంగా తయారైంది. ప్రయాణీకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రి వేళల్లో మహిళలు, చిన్నారులతో వచ్చే ద్విచక్ర వాహన చోదకుల పరిస్థితి మరింత నరకం. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలి. ప్రయాణీకులకు ప్రమాదాలను తప్పించాలి.

- శ్రీనివాసులురెడ్డి, ఇస్కపాళెం, బుచ్చి

ప్రజా సంక్షేమమే నా లక్ష్యం

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

విడవలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోవూరు నియోజకవర్గ ప్రజల సంక్షేమమే నా లక్ష్యమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. మండల పరిదిలోని ఊటుకూరు, విడవలూరు,, పార్లపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన వివిధ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. తొలుత ఊటుకూరు గ్రామంలో నాయకులు రమేష్ నూతనంగా ఏర్పాటు చేసిన ఎల్ఎంఎల్ మినీ ఫంక్షన్ హాల్‌ని ఎమ్మెల్యే ప్రారంబించారు. వెంకటేశ్వరస్వామి కళ్యాణ వేడుకల్లో పాల్గొని స్వామి, అమ్మవార్లకి పట్టు వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. విడవలూరు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. పార్లపల్లిలో జరిగిన రైతన్న మీకోసం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోని వచ్చిన తరువాత విదేశీ పెట్టుబడులు పెరిగాయన్నారు. యువతకి ఉద్యోగవకాశాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో నగేష్‌కుమారి, తహసీల్దారు చంద్రశేఖర్, టీడీపీ నాయకులు అడపాల శ్రీధర్‌రెడ్డి, పాశంశ్రీహరిరెడ్డి, పూండ్ల అచ్యుత్ రెడ్డి, చెముకుల కృష్ణ చైతన్య, బెజవాడ వంశీ కృష్ణారెడ్డి, సత్యవోలు సత్యంరెడ్డి , కొమ్మి శ్రీధర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గోపురానికి ఎమ్మెల్యే ప్రశాంతి శంకుస్థాపన

కొడవలూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలో వెంకన్నపురం గ్రామంలో వెలిసివున్న వెంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురం శంకుస్థాపనను ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, రాష్ట్ర పొల్యూషన్ చైర్మన్ పి.కృష్ణయ్య బుధవారం చేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నాపా వెంకటేశ్వర్లు నాయుడు, అజయ్‌యాదవ్ పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మండలంలో మానేగుంటపాడు కోదండ రామాలయంలో బుధవారం జరిగిన సీతారామ కల్యాణంలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి పాల్గొన్నారు. ప్రత్యేక హోమం నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

కాకాణిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు: ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అడ్డగోలుగా మాట్లాడిన కాకాణిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి, రెండింటికి శంకుస్థాపన చేశారు. కాకాణి ఒంట్లో కొవ్వు పెరిగి బేరియాట్రిక్ సర్జరీలు చేయించుకున్నాడు. త్వరలోనే ఆయన కొవ్వు తగ్గిస్తామన్నారు. టీడీపీ నాయకులు వెంకటప్పయ్య, చంద్రశేఖర్, కార్యకర్తలు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వేసవిలోనూ తాగునీటి ఎద్దడి ఉండదు

● ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి


ట్యాంకును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

పొదలకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) :మండలంలో రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా శాశ్వత పరిష్కారం చూపుతున్నామని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని వినాయక మాన్యంలో జల్ జీవన్ మిషన్ పథకం కింద రూ. 2.42 కోట్లతో నిర్మించిన 90 వేల లీటర్ల వాటర్ ట్యాంకును ఆయన ప్రారంభించారు. అలాగే మర్రిపల్లిలో రూ.1.51 కోట్లతో నిర్మించిన ఓవర్ హెడ్ ట్యాంక్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో ఆఫీస్ సమీపంలో రూ.92 లక్షలతో నిర్మించనున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం నూతన సొసైటీ బిల్డింగు, సొసైటీ బ్రాంచ్ శంకుస్థాపన చేశారు. తాగునీరు సమస్య లేకుండా కండలేరు డ్యామ్ నుంచి పైప్‌లైన్ ద్వారా పొదలకూరు నీటిని అందిస్తున్నామని తెలిపారు. వేసవిలోనూ పట్టణంలో నీటి కొరత ఉండదన్నారు. కార్యక్రమంలో డీసీఎంసీ చైర్మన్ మెట్టుకూరి ధనుంజయరెడ్డి, డీసీఓ గురప్ప, డీఎల్‌సీఓ వెంకటేశ్వర్లు, గంగోటి నాగేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ తలచీరు మస్తాన్‌బాబు, టీడీపీ నాయకులు డైరెక్టర్లు కోడూరు పెంచల భాస్కర్‌రెడ్డి, గంటా మల్లికార్జునయాదవ్, కలిచేటి ప్రభాకర్‌రెడ్డి, పులిపాటి వెంకటరత్నం నాయుడు, బొద్దులూరి మల్లికార్జున్‌నాయుడు, శరత్, హరినారాయణ, సందీప్, ఆదాల సుగుణమ్మ, అరుణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరిస్తాం

తోటపల్లిగూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గిరిజనులు పడుతున్న సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని జనసేన నాయకులు బొబ్బేపల్లి సురేష్‌నాయుడు పేర్కొన్నారు. మాచర్లవారిపాలెం, పాపిరెడ్డిపాలెం, గిరిజన బుధవారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏఎంసీ డైరెక్టర్ వాణిభవానీ, జనసేన నాయకులు, పాల్గొ న్నారు.

అన్నదాతల సంక్షేమమే ధ్యేయం

ముత్తుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : అన్నదాతల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని సీనియర్ టీడీపీ నాయకులు కొత్తపల్లి రమేష్‌శర్మ తెలిపారు. బుధవారం బ్రహ్మదేవంలో రైతన్న మీ కోసం కరపత్రాలను ఇంటింటికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆలూరి వెంకటవిష్ణువర్ధనరావు, బొబ్బేపల్లి అంకయ్య పాల్గొన్నారు.

అంతదూరం కష్టమబ్బా!

(5వ పేజీ తరువాయి)

తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. అయితే దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చి, ఉద్యమించారు. అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో కలువాయిని నెల్లూరు జిల్లాలోనే ఉంచారు. అయితే, ఇప్పుడు మళ్లీ తిరుపతి జిల్లాలో చేర్చనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాపూరుపై మిశ్రమ స్పందన

(5వ పేజీ తరువాయి)

వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నెల్లూరు పరిధిలో ఉన్న రాపూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయడాన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నెల్లూరుకు 60 కి.మీ దూరం ఉండగా, తిరుపతికి 90 కి.మీ ఉంటుందని, ప్రయాణ సౌలభ్యం అసౌకర్యంగా ఉంటుందని, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు సైదాపురం మండలాన్ని కూడా నెల్లూరులోనే ఉంచాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సమస్యలు ఎదుర్కొంటాం!



కండలేరు జలాశయం ముంపు గ్రామాల సమస్యలను 40 సంవత్సరాలుగా ఎదుర్కొంటూనే ఉన్నాం. గూడూరు రెవెన్యూ డివిజన్‌లో రాపూరు మండలాన్ని కలపడం వల్ల రెవెన్యూ రికార్డుల పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటాం. అందువల్ల నెల్లూరు జిల్లాలోనే రాపూరును కొనసాగించాలి.

- సయ్యద్, మండల కో-ఆప్షన్ సభ్యుడు

నెల్లూరే అన్ని విధాలా సౌకర్యం



ఏవిధమైన కార్యకలాపాలకు అయినా రాపూరు ప్రజలందరికీ నెల్లూరు జిల్లా అనుకూలంగా ఉంటుంది. నెల్లూరుకు 60 కి.మీ దూరం ఉండగా సౌకర్యంగా, సౌలభ్యంగా ఉంటుంది. అయితే, తిరుపతికి 90 కి.మీ ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.

- ప్రసాద్, వ్యాపారి, రాపూరు

కలువాయిని నెల్లూరులో ఉంచాలి



కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి. ఇక్కడ నుంచి తిరుపతికి కనీసం బస్సు సౌకర్యం కూడా సక్రమంగా లేదు. ఉన్నతాధికారులను కలసి ఇక్కడి సమస్యలను తెలిపాలన్నా 140 కి.మీ దూరం వెళ్లాలి. ఈ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకుపోతాము. ప్రభుత్వం కూడా పునరాలోచన చేయాలి.

- పెరంకొండ మనోహర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు


ప్రథమ బహుమతి సాధించిన నెల్లూరు జట్టు బాలురు

బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరు బాలురు ప్రథమం

● సింగిల్స్ విభాగంలోనూ ఫస్ట్

మచిలీపట్నం టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీల్లో నెల్లూరు టీమ్ ప్రథమ స్థానంలో నిలిచి రోలింగ్ కప్పు సాధించింది. ద్వితీయ బహుమతిని తూర్పుగోదావరి, తృతీయ బహుమతిని విశాఖ, నాలుగవ బహుమతిని పశ్చిమగోదావరి జిల్లా బాలురు గెలుచుకున్నారు. బాలికలకు జరిగిన బ్యాడ్మింటన్ టీమ్ పోటీల్లో కృష్ణాజిల్లా బాలికలు విజేతలుగా నిలిచారు. నెల్లూరు బాలికలు ద్వితీయ, తూర్పుగోదావరి బాలికలు తృతీయ, అనంతపురం బాలికలు చతుర్థస్థానంలోనూ నిలిచారు. కాగా సింగిల్స్‌కు జరిగిన హోరాహోరీ పోటీల్లో నెల్లూరు జిల్లా క్రీడాకారుడు వర్షిత్ 30 పాయింట్లు సాధించి ప్రథమ స్థానంలో నిలిచాడు. విశాఖ క్రీడాకారుడు రుత్విక్ 27 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచాడు. కృష్ణాజిల్లాకు చెందిన కోనేరు మోక్షసాయి తృతీయ, కుందేటి సుహాస్‌లు 4వ స్థానంలో నిలిచారు. బాలికలకు నిర్వహించిన సింగిల్స్‌లో కర్నూలుకు చెందిన ఎం. కనిష్క ఫైనల్స్‌లో 30 పాయింట్లు సాధించి గెలుపొందింది. ద్వితీయ స్థానంలో కృష్ణాజిల్లా క్రీడాకారిణి కె.రుత్విక 25 పాయింట్లు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. కాగా తృతీయ స్థానంలో పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన రోషిణి, చతుర్థ స్థానంలో నెల్లూరుకు చెందిన జి.వి. లతారెడ్డి నిలిచారు. విజేతలకు కృష్ణాజిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు గొర్రెపాటి గోపీచంద్ బహుమతులతో బందరు లడ్డూలు అందచేసి మాట్లాడారు.


బాలుర సింగిల్స్‌లో ప్రథమ బహుమతి సాధించిన వర్షిత్

● జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు 8 మంది బాలికలు ఎంపికయ్యారు. కర్నూలుకు చెందిన ఎం.తనిష్కారెడ్డి, కె.రుత్విక, శ్రీరామ్ కావ్య (కృష్ణా జిల్లా), కె. రోషిణి (పశ్చిమగోదావరి), జి.వి. లతారెడ్డి (నెల్లూరు), బి.ఆశాశ్రీ (ప్రకాశం), ఎల్. పూర్వజ (కడప), బి. దివ్యశ్రీ (తూర్పుగోదావరి) ఎంపికయ్యారు. బాలుర విభాగంలో టి.వర్షిత్ (నెల్లూరు), వై.రుత్విక్ (విశాఖ), మోక్షసాయి, సుహాస్ కృష్ణాజిల్లా, జి. షణ్ముఖవర్ధన్ (ప్రకాశం), భార్గవ్ (విశాఖ), ఈశ్వరప్రసాదరెడ్డి (కడప), ఎం.ఎస్.శ్రీచక్రనివాస్ (తూర్పుగోదావరి) ఎంపికయినట్టు పరిశీలకులు ప్రకటించారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం


రాపూరులో బీఆర్‌అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయ శాఖ అధికారి అంజయ్య

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 26 (ఆంధ్ర జ్యోతి): మున్సి పాలిటీతోపాటు మండలంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. రాజ్యాంగ నిర్మా తలు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్, డాక్టర్ రాజేంద్రప్రసాద్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివా ళులర్పించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి బహు మతులు ప్రధానం చేశారు. ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమాలలో హెచ్ఎం వేదవతి, వార్డెన్ నాగరాజు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు చీదరాల చెన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తోటపల్లిగూడూరు : తోటపల్లిగూడూరు మండలం ఇసుకపాలెం సెంటర్‌లో బుధవారం భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఇసుకపాలెం సర్పంచ్ చైతన్య, సిబ్బంది, రైతు నాయకులు పాల్గొన్నారు.

రాపూరు: పట్టణంలోని స్థానిక గ్రంథాలయంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అంబేడ్కర్ గారి ఆశయాలను ప్రతి భారతీయుడు ఆదర్శంగా తీసుకొని నడుచుకోవాలని గ్రంథాలయ అధికారి ఏ.అంజయ్య తెలియజేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకుడు కే వెంకటేశ్వర్లు, పాఠకులు ఉన్నారు.

జాతీయస్థాయి కరాటే పోటీలకు ఎంపిక

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నంద్యాలలో గత మూడు రోజుల క్రితం జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీలలో బుచ్చిరెడ్డిపాళెంలోని రెయిన్‌బో స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. అండర్ 11, 14 విభాగాలలో ఏడుగురు విద్యార్థులు జాతీయస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమని రెయిన్‌బో పాఠశాల డైరెక్టర్ చిట్టిబాబు తెలిపారు. ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ ఎలియారాజ్, పీఈటీ బీవీ. రమణయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ప్రశంసా పత్రాలతో రెయిన్‌బో విద్యార్థులు

C.R.I.M.E N.E.W.S

సిగరెట్లు, పాన్‌మసాలాల పట్టివేత


బాలాజీ నగర్‌లో పార్సిల్ సర్వీసులో పట్టుకున్న సిగరెట్ల బాక్సులు

నెల్లూరు (క్రైం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ. 20 లక్షల విలువైన సిగరెట్లు, పాన్ మసాలాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అనంతరం వాటిని జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సిగరెట్లు, పాన్‌మసాలాలు దిగుమతి చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నెల్లూరు నగరంలోని వెంకట రామా పురంలోని బీఎంపీఎస్ పార్శిల్ సర్వీస్‌లో పెద్ద ఎత్తున సిగరెట్లు, పాన్‌మసాలాలు రవాణా అవుతున్నాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కే.నరసింహారావు, డీసీటీవో కే.విష్ణురావు, డీసీటీవో(జీఎస్టీ) ఎన్‌వీ సుబ్బారావులు తమ సిబ్బందితో పార్శిల్ సర్వీస్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా 24 బాక్సుల సిగరెట్లు, మూడు బాక్సుల పాన్‌మసాలా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బిల్లులు లేకుండా తరలిస్తున్న సిగరెట్లు, పాన్‌మసాలా ప్యాకెట్లు ఎక్కడికి తరలిస్తున్నారు, ఎవరు ఎవరి పేరుపై బుక్ చేశారు, ఇలా అనేక వివరాలపై అధికారులు ట్రాన్స్‌పోర్టు కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. అయితే వారు తమ వద్ద ఫోన్ నెంబరు మాత్రమే ఉందని, ఇతర వివరాలు లేవని సమాధానం ఇచ్చారు. దీంతో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.20 లక్షల విలువ చేసే సిగరెట్లు, పాన్‌మసాలాలను తదుపరి విచారణ నిమిత్తం జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన సరుకు నకిలీవా, అసలైనవా గుర్తించేందుకు శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. ఫోన్ నెంబరు ఆధారంగా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు ప్రారంబించారు. చెన్నై నుంచి నర్సరావుపేటకు గుర్తు తెలియని వ్యక్తి బుక్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పార్శిల్ కార్యాలయంలో ఏదైనా వస్తువును పార్శిల్ బుక్ చేసుకునే సమయంలో అక్కడి సిబ్బంది ఎక్కడికి పంపుతున్నారు.. వారి చిరునామా, ఫోన్‌నెంబరు వివరాలు సేకరించిన తర్వాత మాత్రమే బుకింగ్ చేసుకుంటారు. అవేమి లేకుండా కేవలం ఫోన్ నెంబరు ఆధారంగా పాన్‌మసాలాలు, సిగిరెట్లు తరలింపుపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. పార్శిల్ కార్యాలయ సిబ్బంది ప్రమేయంపై అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ


చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ఇందుకూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తిపాలెం గ్రామంలో రన్నింగ్‌లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లలో గుర్తు తెలియని వ్యక్తులు ఏబీ స్విచ్ ఆపేసి లోపల ఉన్న ఆయిల్, రాగి వైర్లను మంగళవారం రాత్రి అపహరించారు. ఏబీ స్విచ్ లేని ట్రాన్స్ ఫార్మర్లను కూడా ఊడదీసి, ఆయిల్, రాగి వైరును చాకచక్యంగా దొంగిలించారు. ట్రాన్స్‌ఫార్మర్ గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే ఇలాంటి దొంగతనాలు చేయగలరని విద్యుత్‌శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నార్లు పోసుకునే సమయంలో ట్రాన్స్ ఫార్మర్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పోలీసు గస్తీ లేక పోవడం వల్లే తరచూ ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనాల్లో ఒంటరిగా వస్తున్న వారిని బెదిరిస్తున్నారని మండల ప్రజలు చెబుతున్నారు. పోలీసు అధికారులు రాత్రిళ్లు గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు పట్టాలపై విద్యార్థి మృతదేహం

కావలి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోఆపరేటివ్‌కాలనీ సమీపం లో రైలు పట్టాలపై డిగ్రీ విద్యార్థి దద్దాల ఆకాష్ (19) మృతదేహాన్ని మంగళవారం రాత్రి గూడ్సు గార్డు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమందించాడు. మృతదేహాన్ని పరిశీలించిన జీఆర్పీ పోలీసులు వివరాలు వెల్లడించారు. ఉలవపాడు మండలం మన్నేటికోటకు చెందిన బాబురావుకు ముగ్గురు కుమారులు. వారి చదువుల కోసం పట్టణం లోని వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్నారు. మూడవ కుమారుడు ఆకాష్ స్థానిక ఎమ్మెస్సార్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం ఇంటి నుండి వెళ్లిన ఆకాష్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు జీఆర్పీ పోలీసులను సంప్రదించారు. మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించాక ఆకాష్‌గా గుర్తించి కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. వ్యక్తిగత కారణాలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థిపై నవోదయ కోచింగ్ సెంటర్ నిర్వాహకుడి దాష్టీకం


విద్యార్థి కాలుపై పడ్డ వాతలు

ఉదయగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణంలోని బాలాజీ నగర్‌లో గల ప్రతిభ నవోదయ కోచింగ్ సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి జయంత్ రెడ్డిపై నిర్వాహకుడు అంజయ్య వాతలు పడేలా కొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కలిగిరి పట్టణానికి చెందిన ఎం జయంత్ రెడ్డి నవోదయ కోచింగ్ కోసం ఉదయగిరిలోని ప్రతిభ నవోదయ కోచింగ్ సెంటర్‌లో చేరాడు. ఆ విద్యార్థి ఇక్కడే విద్యనభ్యసిస్తూ వసతిగృహంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వా హకుడు అంజయ్య విద్యార్థి కాలుపై కొట్టడంతో వాతలు పడ్డాయి. సమాచారం అందు కున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు రాత్రి కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి నిర్వాహకుడిపై వివాదానికి దిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పమని పంపితే వాతలు పడేలా కొడ తారా.. అంటూ మండిపడ్డారు. నిర్వాహకుడికి కట్టిన ఫీజు వాపసు తీసుకుని జయంత్‌రెడ్డిని ఇంటికి తీసుకెళ్లారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం తూర్పుబోయమడగల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కాంచెరువు గ్రామానికి రావూరి కొండయ్య తన ఆటోలో మనవడితో కలిసి పని నిమిత్తం వరికుంటపాడుకు వెళ్లాడు. అదే క్రమంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో కొండయ్యతో సహా మనవడు సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 660

పేదల సొంతింటి కల సాకారం ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : పేదల సొంతింటి కల సాకారం చేసేలా రాష్ట్ర గృహనిర్మాణ శాఖ కృషి చేస్తుందని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. నగరంలోని సోమిరెడ్డి కార్యాలయంలో బుధవారం హౌసింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 2019కి ముందు టీడీపీ హయాంలో నిర్మించిన ఇళ్లకు బిల్లులు పొందలేని వారి వివరాలు సేకరించాలన్నారు. వైసీపీ ప్రభుత్వం కక్ష సాధింపుతో బిల్లులు చెల్లించలేదని, వారి వివరాలు సమగ్రంగా సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి బిల్లులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రతి గ్రామంలో ఇళ్లులేని పేదలను గుర్తించి ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో వివరాలు పొందుపరచాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణంలోనూ నాణ్యత లోపిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆ దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణలో 'పోలీస్' పాత్ర కీలకం

- బీఆర్ అంబేద్కర్‌కు ఎస్పీ అజిత వేజెండ్ల నివాళి
- పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవం
- ర్యాలీలు నిర్వహించిన విద్యార్థులు
- ప్రతిజ్ఞలు చేసిన పౌరులు, అధికారులు



జిల్లా పోలీసు కార్యాలయంలో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎస్పీ అజిత



సమగ్రశిక్ష కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు

నెల్లూరు(క్రైం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ పరిరక్షణలో పోలీస్ శాఖ పాత్ర ముఖ్యమైందని, శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, పౌరుల ప్రాథమిక హక్కుల పరిరక్షణలో పోలీసులు నిబద్ధత, న్యాయబద్ధంగా సేవ చేయాలని జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఎస్పీ మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం ప్రభుత్వ ప్రతం కాదని, భారత ప్రజాస్వామ్యానికి ఆత్మ, సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సోదరభావం వంటి విలువలకు మూలాధారమన్నారు. రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు, విధులు, చట్టాలే ప్రజలకు రక్షణ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ చంద్రమోహన్, ఏవో చంద్రమౌళి, ఏఏవో సావిత్రమ్మ, వెల్ఫేర్ ఆర్ఐ రాజారావు పాల్గొన్నారు.

- **నెల్లూరు(విద్య) :** రాజ్యాంగంపై విద్యార్థులు పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయం, జిల్లా సమగ్రశిక్ష కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీసీ డీ.వెంకటసుబ్బయ్య, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.
- నగరంలోని వీఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎస్‌సీఈఆర్టీ ప్రాంతీయ విద్యాసంస్థలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభావంతులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మీనరసింహ, ప్రొఫెసర్ రమేష్ బాబు, నోడల్ ఆఫీసర్ జీ.నరసింహారెడ్డి పాల్గొన్నారు.
- దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ డి.గిరి, పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ టి.రాంబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.
- డీకే ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎంసీ కమిషనర్ వై.ఓ.నందన్ పాల్గొని మాట్లాడారు. అనంతరం విద్యార్థినులకు వ్యాసరచన పోటీ నిర్వహించి విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐవో వరప్రసాద్ రావు, కార్పొరేషన్ ఎస్ఈ రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రమణారెడ్డి పాల్గొన్నారు.
- కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసులరెడ్డి, నోడల్ ఆఫీసర్ సంజయ్‌బాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.
- వెంగళరావునగర్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, కేడెట్‌లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయిని సీ.మంజులవాణి పాల్గొన్నారు.
- **నెల్లూరు(వైద్యం) :** భారతదేశ ప్రజాస్వామ్యంలో రాజ్యాంగ న్యాయ దినోత్సవం ఓ మైలు రాయి వంటిదని, ఈ కార్యక్రమం జరుపుకోవడం ఎంతో ఆనందంగా ఉందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఇందిరాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అబ్జర్వర్ కమలాకర్, నేతలు శ్రీనివాసులరెడ్డి, కిరణకుమార్‌రెడ్డి, బాలసుధాకర్, ఏటూరి శ్రీనివాసులరెడ్డి, ఫయాజ్, సంజయ్‌కుమార్, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.
- **నెల్లూరు(హరనాథపురం):** నగరంలోని అంబేద్కర్ భవన్‌లో ఎస్‌సీ, ఎస్టీ జేఏసీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ వాదనాల వెంకటరమణ, కో చైర్మన్ పల్లాల శ్రీనివాసులు, కోశాధికారి కొత్త ఆనందరావు, శైలేంద్రబాబు పాల్గొన్నారు.
- నగరంలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో రాజ్యాంగ న్యాయ దినోత్సవ వేడుకలను సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు పందిటి సుబ్బయ్య మాదిగ నేతృత్వంలో నాయకులు ఘనంగా నిర్వహించారు.
- **నెల్లూరు(సాంస్కృతికం) :** నగరంలోని సమరసత వేదిక ఆధ్వర్యంలో 79వ రాజ్యాంగ దినోత్సవం కార్యక్రమం ఘనంగా జరిగింది. డాక్టర్ వేణు, జయప్రకాష్, తదితరులు మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి వీఆర్సీ వరకు ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సమరసత జిల్లా అధ్యక్షుడు కోడూరు సత్యం అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మోమిడి శ్రీనివాసులు, మాధవరావు, పోలయ్య, రాజేంద్ర, జయప్రద, శీనమ్మ, కృష్ణమూర్తి, రమేష్‌బాబు, పూడి రవి పాల్గొన్నారు.
- జేవీవీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నగరంలోని వెంగళరావునగర్ మున్సిపల్ హైస్కూల్‌లో హెచ్ఎం మంజుల అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జేవీవీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ వీ.వేణుగోపాల్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ.చక్రపాణిలు పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి ఘన నివాళులర్పించారు.
- స్థానిక స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్ఎస్ఎస్ నగర పాలక ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం గురించి ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్‌బాబు వివరించారు. ఈ సందర్భంగా రాజధానిలో పాఠశాల విద్యార్థులచే నిర్వహించబడిన మాక్ అసెంబ్లీ ప్రత్యక్ష ప్రసారాన్ని విద్యార్థులతో కలసి తిలకించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ఇందిరాభవన్‌లో మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు చేవూరి దేవకుమార్‌రెడ్డి



అంబేద్కర్ భవన్‌లో నివాళులర్పిస్తున్న ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ నాయకులు

30 రోజుల్లో కొండ్లపూడికి సీసీ రోడ్డు నిర్మాణం

- రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కొండ్లపూడి ప్రధాన రహదారిపై 30 రోజుల్లో సీసీరోడ్డు నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందచేస్తామని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం రూ.45 లక్షలతో నిర్మించతలపెట్టిన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో దశాబ్దాలుగా ఉన్న సమస్యలన్నింటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అందులో రోడ్ల సమస్యలు దాదాపుగా పూర్తి చేశామని చెప్పారు. రాజకీయాలతో సంబంధం లేకుండా అభివృద్ధే అజెండాగా పనులు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విజయకుమార్, టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, శ్రీధర్‌రెడ్డి, పముజుల ప్రదీప్, జలదంకి సుధాకర్, అల్లాభక్షు, ఉదయ భాస్కర్ పాల్గొన్నారు.

ఆపరేషన్ కగారు పేరుతో

ఆదివాసీలు, మావోయిస్టుల నరమేధం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్షాల నేతల ధ్వజం



ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన వారికి సంతపంగా మౌనం వహిస్తున్న వామపక్ష నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో ఆపరేషన్ కగారు పేరుతో ఆదివాసీలు, మావోయిస్టులను కేంద్రంలోని మోదీ, షాల పేరుతో నరమేధం చేస్తున్నారని సీపీఎం, సీపీఐ జిల్లా కార్యదర్శులు మూలం రమేష్, అరిగెల నాగేంద్రసాయిలు పేర్కొన్నారు. బుధవారం జిల్లా సీపీఎం కార్యాలయంలో జరిగిన రౌండ్ టేబుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు దాదాపు 700 మంది ఆదివాసీలు, మావోయిస్టులను హత్య చేశారన్నారు. కొన్ని వందల మంది ఆదివాసీలను జైళ్లలో, మిలటరీ క్యాంపులలో నిర్బంధించారన్నారు. వం దల మంది మహిళలను అత్యాచారానికి గురిచేస్తూ లక్షల మంది సైన్యాన్ని దించి అటవీ ప్రాంతాన్ని యుద్ధ వాతావరణంగా మార్చారని విమర్శించారు. దండకారణ్యంలోని ఖనిజ సం పదను దోచిపెట్టేందుకు కార్పొరేటర్లకు అప్పగించేందుకు ఈ నరమేధం సృష్టిస్తుందని ఆరోపించారు. అనంతరం ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన వారి పట్ల రెండు నిమిషాలు మౌనం వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సాగర్, ఎల్లంకి వెంకటేశ్వర్లు, మాదాల వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, అజయ్‌కుమార్, గోగుల శ్రీనివాసులు, కత్తి శ్రీనివాసులు, రామరాజు, లీలా మోహన్, తదితరులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యం స్వామి షష్ఠి పూజలు



కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో కల్యాణ వేదికపై వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం అన్నీ శైవక్షేత్రాల్లో స్వామి సుబ్రహ్మణ్యం షష్ఠి పూజలు నిర్వహించారు. స్వామి వార్లకు పాలాభిషేకాలు, సహస్ర నామార్చనతోపాటు విశేషాలంకారం జరిగింది. సాయంత్రం విశేషపూజలు, పల్లకీసేవలు, ఉత్సవాలు, కల్యాణాలు నిర్వహించారు. భక్తులతో ఆలయాలు కళకళలాడాయి. నగరంలోని అన్నీ శివాలయాల్లో సుబ్రహ్మణ్యం షష్ఠి పూజలు ఘనంగా జరిగాయి. ఉస్మాన్‌సాహెబ్‌పేట కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో సుబ్రహ్మణ్యం షష్ఠి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఆలయ ఈవో దర్గయ్య పర్యవేక్షించారు. సండేమార్కెట్ సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో, కనుపర్తి పాడు ఆలయంలో సుబ్రహ్మణ్యం షష్ఠి పూజలు నిర్వహించారు.

నగరంలో ఆర్వోబీలు నిర్మించాలి : డీవైఎఫ్ఐ

నెల్లూరు(వైద్యం) నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని రైల్వేట్రాక్ తూర్పు, పడమర ప్రాంతాలలో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి నరసింహ కోరారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చిన్నపాటి వర్షం వచ్చినా ఇటు నుంచి అటు వైపు వెళ్లేందుకు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందన్నారు. దీనికోసం నగర ప్రజలు ఉద్యమం చేయాలన్నారు. మంచినీటి సమస్యపై ఈ నెల 27వ తేదీన కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపడుతున్నామని పేర్కొన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరించారు. డీవైఎఫ్ఐ నేతలు సురేంద్ర, రాజేష్, కృష్ణ, కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను శాస్త్రవేత్తలగా తీర్చిదిద్దాలి : డీఈవో



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డీఈవో బాలాజీరావు

నెల్లూరు(విద్య), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల ప్రతి భను గుర్తించి శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయా లని డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు అన్నారు. నగరంలోని దర్గామిట్ట జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్‌ల వర్క్‌షాప్‌ను ఆయన పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయు లు, ల్యాబ్ ఇన్‌చార్జిలకు ప్రాజెక్టుల తయారీ, నిర్వహణపై నిర్వహించిన శిక్షణ ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలించి అభినందించారు. ఈ కార్యక్రమంలో కోర్స్ డైరెక్టర్ ఏఎంవో సుధీర్, మెంటర్స్ కళ్యాణ్‌కుమార్, కార్తీక్, సంతోష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంఎస్ఎం విద్యార్థులు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): అహోబిలం జడ్పీ ఉన్నత పాఠశాలలో త్వరలో జరగనున్న 69వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-17 బాల, బాలికల బేస్‌బాల్ పోటీలకు తమ పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారని ఏసీ నగర్ ఎంఎస్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పీ.మురళీకృష్ణ తెలిపారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తమ విద్యార్థులు ఓ.ప్రేమ్‌కుమార్, టీ.శ్రీనివాసులు, వై.చరణ్‌కుమార్, ఏ.వైష్ణవి రాష్ట్ర పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పీ.అజయ్‌కుమార్, ఎస్.రేష్మ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

నెల్లూరు(సిటీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రజా సమస్యలకు మంత్రి నారాయణ శాశ్వత పరిష్కారాలు చూపుతున్నారని ఎన్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ తెలిపారు. బుధవారం సండేమార్కెట్ వద్ద నిర్మాణంలో ఉన్న సీసీరోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ పోకల రవి, నాయకులు సుజస్, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఏం చేద్దాం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేగాక మేయర్ చాంబరుతోపాటు పేషీ మరమ్మతు పనుల్లో వాస్తవ విరుద్ధంగా బిల్లులు పెట్టారన్న విమర్శలున్నాయి.

- **బిల్లులు వస్తాయా!?**

ప్రస్తుత ప్రభుత్వం మేయర్‌పై అవిశ్వాస తీర్మానం రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రధానంగా మేయర్ అనుచర దళం అనేక రూపాలలో పనులు చేసినట్లు బిల్లులు కార్పొరేషన్‌లో దాఖలు చేశారు. ఈ ప్రక్రియ వివిధ సెక్షన్ల వద్ద ఉంది. అన్నీ కలిపి సుమారు రూ.60 లక్షల వరకు బిల్లులు మేయర్ దళం నుంచి వెళ్లాయి. ఇవన్నీ మంజూరు అవుతాయా...? లేదా..? తిరిగి విజిలెన్స్ విచారణ జరుపుతారా...? అన్నది అయోమయంగా మారింది. అవిశ్వాసం చర్చ తెరపైకి వచ్చినప్పటి నుంచి ఆమె అనుచర దళం ఆందోళనకు గురవుతోంది. ఈ మేరకు అధికార పార్టీలో బిల్లులపై పునఃసమీక్షించాలన్న డిమాండ్ అధికారుల వద్దకు చేరడం గమనార్హం.

మాపై కక్షగట్టారు!

(5వ పేజీ తరువాయి)

గురి చేస్తున్నారని వాపోయారు. ఏదైన సమస్య ఉంటే తమతో నేరుగా ఎదుర్కోవాలని హితవు పలికారు. ఎందాకైనా పోరాటానికి, ప్రాణత్యాగానికి సంసిద్ధులమై ఉన్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న కీచక పర్వంపై టీడీపీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలు ఆరా తీయాలని విజ్ఞప్తి చేశారు. తమ పదవిపై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ కన్నేశాడని, అనేక దఫాలుగా తమ వద్దకు వచ్చి సెలవుపై వెళ్లాలని, అలా వెళ్తే ఇన్‌చార్జి మేయర్‌గా ఉండవచ్చని తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెప్పారు. తాము అభివృద్ధిని అడ్డుకుంటున్నామని రూప్‌కుమార్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు చెప్పినట్లు తాము అవినీతికి పాల్పడితే ఇప్పటివరకు చూస్తూ ఎందుకు ఉన్నారని సూటిగా ప్రశ్నించారు.

ప్రతీ ఒక్కరికీ వ్యక్తిత్వ వికాసం అవసరం : కమిషనర్



మాట్లాడుతున్న కమిషనర్ నందన్

నెల్లూరు(సిటీ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మంచి అలవాట్లతో పాటు స్థిరత్వం పొందాలంటే వ్యక్తిత్వ వికాసం చాలా అవసరమని ఎన్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. కార్పొరేషన్ ఆధ్వర్యంలో బుధవారం కస్తూర్బా కళాక్షేత్రంలో రెండు రోజుల శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం పెంపొందించుకుంటే ధైర్యం, నమ్మకం, జీవితంలో సవాళ్లను ఎదుర్కొనే శక్తిని ఇస్తాయన్నారు. విధుల్లోనూ నిజాయితీగా వ్యవహరిస్తు విలువలతో నడుచుకోవాలని సూచించారు. వ్యక్తిత్వ వికాసాన్ని పెంచుకుంటు ఇతరులతో వ్యవహరించే తీరు మారుతుందన్నారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు, కళాశాల విద్యార్థులకు నిపుణుడు డాక్టర్ చిరంజీవి తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ మాధురి, ఎస్ఈ రామ్మోహన్‌రావు, టీపీఆర్వో వాసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారిత కేంద్రంలో న్యాయ విజ్ఞాన సదస్సు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : నగరంలోని మహిళా సాధికారిత కేంద్రంలో సీనియర్ సివిల్ జడ్జి వాణి ఆధ్వర్యంలో బుధవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వరకట్న నిషేధ చట్టం గురించి వివరిస్తూ వరకట్నం ఇవ్వడం, తీసుకోవడం నేరమని వివరించారు. రాజ్యాంగం ప్రకారం వచ్చే హక్కులను వినియోగించుకోవాలన్నారు. భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని భారత రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ హేనాసుజన్, మహిళా ప్రాంగణం మేనేజర్ మాధవి, నోడల్ అధికారి వీవీ అనురాధ, అర్బన్ సీడీపీవో అరుణ, తదితరులు పాల్గొన్నారు.

డీసీసీబీలో ఉద్యోగోన్నతులకు ఇంటర్వ్యూలు



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న డీసీసీబీ చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి, తదతరులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్ర సహకార బ్యాంకులో అధికారులు, సిబ్బందికి ఉద్యోగోన్నతులు కల్పించడానికి బుధవారం చైర్మన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు నార్మల్ ట్రాక్ ఉద్యోగోన్నతుల పేరుతో నిర్వహించిన ఈ ఇంటర్వ్యూల కార్యక్రమంలో సీఈవో శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆసుపత్రిలో అన్నదానం

నెల్లూరు(వైద్యం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : ఇండియన్ రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రిలో బుధవారం రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి దాత చంద్రగిరి నారాయణ పుట్టిన రోజు సందర్భంగా ఆయన కుమారుడు చంద్రగిరి అజయ్‌బాబు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంజీ క్రికెట్ క్రీడాకారుడు రెడ్‌క్రాస్ సభ్యుడు మలిరెడ్డి కోటారెడ్డి, రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ లక్ష్మి, రెడ్‌క్రాస్ జీవిత కాల సభ్యులు వెంకటేశ్వరరావు, మురళీకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రగడ కోటయ్యకు ఘన నివాళి



ప్రగడ కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న చేనేత సంఘాల నాయకులు

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికుల అభివృద్ధికి పాటుపడిన మహనీయుడు ప్రగడ కోటయ్యని చేనేత ఐక్య కార్యాచరణ కమిటీ అధ్యక్షుడు బుధవరపు బాలాజీ కొనియాడారు. ప్రగడ కోటయ్య 30వ వర్థంతి సందర్భంగా నగరంలోని మారం సుధాకర్ ఆసుపత్రి ప్రాంగణంలో కోటయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కమిటీ జిల్లా ప్రతినిధులు జానపాటి రామసుబ్బయ్య, సోమా గోపాల్, దోనేపూడి కోటేశ్వరరావు, సోమా పురంధర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

నేడు అరవిత్తూరు విశ్వనాథశ్రౌత జయంతి

నెల్లూరు(సాంస్కృతికం) నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : వేద సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని స్థానిక టీవీఎస్ కళ్యాణ సదన్‌లో బ్రహ్మశ్రీ అరవిత్తూరు విశ్వనాథశ్రౌత 105వ జయంతి సభలు ఆయన శిష్య బృందం ఆధ్వర్యంలో జరుగుతాయని మాచవోలు భాస్కరశర్మ, బందాత్మకూరు చంద్రశేఖర నాగభూషణశర్మ తెలిపారు. బుధవారం ఉదయం పరిషత్ కార్యాలయంలో వారు ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు.



ఉత్సాహంగా పారా క్రీడాకారుల పోటీలు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో బుధవారం నిర్వహించిన జిల్లాస్థాయి పారా క్రీడాకారుల పోటీలు ఉత్సాహంగా జరిగాయి. జిల్లా వ్యాప్తంగా హాజరైన 110 మంది క్రీడాకారులకు బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, టేబుల్‌టెన్నిస్, స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా జట్టుకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు గుంటూరులో డిసెంబరు 1, 2 తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని పారా స్పోర్ట్స్ అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన పారా స్పోర్ట్స్ క్రీడాకారులు వీ భవాని, బీ శ్రీహరిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడీ మహ్మద్‌అయూబ్, డీఎస్‌డీవో ఎం.పాండురంగారావు, పారా స్పోర్ట్స్ సంఘం ప్రతినిధులు మాల్యాద్రి నాయుడు, యాదగిరి, డీఎస్‌ఏ కోచ్‌లు పాల్గొన్నారు.

భళా.. 'బాల' నాయకా!

ఖద్దరు పంచెలు.. కండువాల్లో ముచ్చటగా బాలురు.. చీరలు ధరించి, చేతిలో ఫైల్స్ పట్టుకుని బాలికలు.. అభినవ ప్రజాప్రతినిధులై మాక్ అసెంబ్లీకి హాజరయ్యారు. మనుబోలు జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం 'బాల ' నాయకులు ముచ్చటైన వేషధారణలో తళుక్కుమన్నారు. మండలంలోని 7 ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో బుధవారం





రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులర్పించారు. అనంతరం చిన్నారులతో నిర్వహించిన మాక్ అసెంబ్లీ ఆద్యంతం అలరించింది. ఉపన్యాసాలతో చిన్నారులు అదరగొట్టారు. అసెంబ్లీ నిర్వహణ, ప్రజా సమస్యలు, ప్రశ్నోత్తరాలు తదితర అంశాలపై ఉపాధ్యాయులు విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు.

- మనుబోలు (ఆంధ్రజ్యోతి)

విలేజ్ హెల్త్ క్లినిక్‌లు

ఏడాదిలో పూర్తి

- ఆ దిశగా ప్రభుత్వ కసరత్తు
- రూ.12.91 కోట్లు విడుదల
- జిల్లాలో 495 క్లినిక్‌ల నిర్మాణానికి అనుమతులు
- పూర్తయినవి 259 మాత్రమే
- మిగిలిన 236 పనులకు టెండర్లు

నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు మరింత విస్తరించేందుకు గత వైసీపీ ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ప్రారంభించింది. మండలంలోని పీహెచ్‌సీలకు అనుబంధంగా ఇవి పనిచేసేలా, ఆయా ఆరోగ్య కేంద్రాలలో బీఎస్సీ నర్సింగ్ చేసిన ఉద్యోగి ఉండేలా, వారి వద్ద 54 రకాల మందులు అందుబాటులో ఉంచుకునేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఈ క్లినిక్‌లలోనే భవిష్యత్తులో పలు వ్యాధినిర్ధారణ పరీక్షలు చేయాలని నాటి ప్రభుత్వం నిర్ణయించింది. క్లినిక్‌ల బాధ్యతల నిర్వహణకు మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)ను విడతల వారీగా నియమించింది. ఈ కేంద్రాల్లో చిన్న చిన్న వ్యాధులకు చికిత్సలు అందిస్తారు. ఏవైనా అత్యవసర కేసులు వస్తే దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, ఏరియా ఆసుపత్రులకు సిఫార్సు చేస్తారు.

● గత ప్రభుత్వంలో అసంపూర్తి

గత వైసీపీ ప్రభుత్వం 2020 మార్చిలోనే విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో మొత్తం 495 హెల్త్ క్లినిక్‌లు నిర్మించాలని భావించింది. మూడు గదులతో ఈ క్లినిక్‌లకు శాశ్వత భవనాలు నిర్మించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద 50 శాతం, వైద్య శాఖకు చెందిన మరో 50 శాతం నిధుల భాగస్వామ్యంతో నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే వాటిపై సమగ్రంగా దృష్టి పెట్టకపోవటంతో ఇప్పటి వరకు 259 క్లినిక్‌లకు మాత్రమే భవనాలు పూర్తయ్యాయి. మిగిలినవి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అద్దె రూపంలో ప్రభుత్వం ఏటా రూ.లక్షలు చెల్లిస్తోంది. పెండింగ్ భవనాల్లో కొన్ని పునాదుల దశలో, మరికొన్ని పిల్లర్ల దశలో ఉండా దాదాపు 80 హెల్త్ సెంటర్లు అసలు నిర్మాణాలకే నోచుకోలేదు. కొన్ని గ్రామాలలో అయితే అసలు స్థల సేకరణ కూడా జరగకపోవడం గమనార్హం. ఈ నేపథ్యం లో ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ఆయా నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని నిర్ణయించింది. పెండింగ్‌లో ఉన్న 236 విలేజ్ హెల్త్ క్లినిక్ లు పూర్తి చేసేందుకు టెండర్లు పిలవటమే కాకుండా వాటిని పనికి ఆహార పథకం కింద 15 ఆర్థిక సంఘం నిధులతో పూర్తి చేసేందుకు కార్యాచరణ రూపొందిం చింది. కొన్ని నిర్మాణాలకు టెండర్లు పిలవడం తో నిర్మాణాలు మొదలయ్యాయి. గత ప్రభుత్వంలో ఒక్కో నిర్మాణానికి రూ. 17 లక్షలు ఖర్చవుతుండగా ప్రస్తుతం భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం రూ. 26 నుంచి రూ. 35 లక్షలు కేటాయించింది. దీంతో కాంట్రాక్టర్లు కూడా ముందుకు వచ్చి నిర్మాణాలు చేపడుతున్నారు.



భవనాలు త్వరలో అందుబాటులోకి..

జిల్లాలో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు త్వరలో అందుబాటులోకి వస్తాయని భావిస్తున్నాము. రాష్ట్ర ప్రభుత్వం తాజా ప్రకటనలతో ఏడాదిలోనే నిర్మాణాలు పూర్తయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్దె భవనాల్లో విలేజ్ హెల్త్ క్లినిక్‌లు నడుస్తున్నాయి. వాటికి అద్దె రూపంలో లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నాము. భవనాలు పూర్తయితే ఆ భారం కూడా తొలగిపోతుంది.

- డాక్టర్ సుజాత, డీఎంహెచ్‌వో



పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో బేస్‌మెంట్ దశలోనే నిలిచిపోయిన హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం



టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తున్నాం

నిర్మాణానికి నోచుకోని విలేజ్ హెల్త్ సెంటర్ల భవన నిర్మాణాలకు టెండర్లు పిలిచి కాంట్రాక్టర్లకు అప్పగిస్తు న్నాం. వాటిని త్వరలో పూర్తి చేస్తాం. నాలుగేళ్లకుపైగా వాటి నిర్మాణాలు జరగలేదు. రాష్ట్ర ప్రభుత్వ చొరవ కారణంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం, పంచాయ తీరాజ్ నిధులతో నిర్మాణాలు జరుగుతున్నాయి.

- కోటేశ్వరరావు, పంచాయతీరాజ్ ఎస్‌ఈ



కలెక్టరేట్ శంకరన్ హాల్లో భారత రాజ్యాంగ దినోత్సవ ప్రతిజ్ఞ చేస్తున్న జేసీ వెంకటేశ్వర్లు, డీఆర్వో విజయకుమార్ తదితరులు

ప్రజాస్వామ్య విలువలకు భారత రాజ్యాంగం మూలస్తంభం

● జాతీయ న్యాయ దినోత్సవంలో జేసీ వెంకటేశ్వర్లు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య విలువలకు భారత రాజ్యాంగం మూలస్తంభమని జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం జాతీయ న్యాయదినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ శంకరన్ హాల్లో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమానత్వం, న్యాయం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వం వంటి శాశ్వత విలువలను ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిందన్నారు. రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దూరదృష్టి వలనే భారదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా నిలిచిందని తెలిపారు. యువత, విద్యార్థులు రాజ్యాంగంపై అవగాహ న పెంపొందించుకుని దేశాభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో విజయకుమార్, తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పౌరసంబంధాలశాఖ కార్యాలయంలో జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి పీ.వేణుగోపాల్‌రెడ్డి కార్యాలయ సిబ్బందితో కలిసి జాతీయ న్యాయ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఆయన మాట్లాడుతూ సామాజిక సమానత్వం, శాంతి, సామరస్యం, జాతీయ ఐక్యతను కాపాడుతూ రాజ్యాంగ విలువలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అన్నారు.

4వేల బస్తాల బియ్యం బొక్కేశారు!

- ఎంఎల్‌ఎస్ గోదాములో అధికారుల బృందం తనిఖీలు
- 8 గంటలు నిర్విరామంగా రికార్డుల పరిశీలన
- వేల బస్తాల బియ్యం పక్కదారి పట్టినట్లు అంచనా



ఎంఎల్‌ఎస్ గోదాములో సరుకుల నిల్వలను పరిశీలిస్తున్న పౌరసరఫరాల శాఖ అధికారుల బృందం

ఉదయగిరి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఎంఎల్‌ఎస్ గోదామును పౌరసరఫరాల శాఖ రాష్ట్ర ప్రధాన కార్యాలయ అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. ఆ శాఖ జిల్లా మేనేజర్ అర్జున్‌రావుతో కలిసి నిత్యావసర వస్తువుల నిల్వలు, రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసింది. గోదాములో బియ్యం పక్కదారి పట్టాయని జిల్లా అధికారులు నివేదిక ఇవ్వడంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారు గోదాములో తనిఖీలు చేపట్టారు. అనంతరం సెప్టెంబరు, అక్టోబరు, నవంబరు మాసాలకు సంబంధించిన స్టాకు రికార్డులను పరిశీలించేందుకు చర్యలు చేపట్టింది. సెప్టెంబరు, అక్టోబరు మాసాల రికార్డులు పరిశీలించే సరికి సాయంత్రం 6 గంటలు కావడం, గోదాములో సక్రమంగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో కొంతసేపు సెల్‌ఫోన్ వెలుగుల్లోనే రికార్డులు పరిశీలించారు. గోదాములో సుమారు 4 వేల బియ్యం బస్తాలు స్వాహా అయినట్లు తనిఖీ అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. అక్కడ విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల నుంచి లిఖితపూర్వకంగా వివరణ తీసుకున్నారు. అనంతరం రికార్డులన్నింటిని విజయవాడ తరలించి నవంబరు మాసానికి సంబంధించిన రికార్డులు సైతం అక్కడే పరిశీలించి రెండు, మూడు రోజుల్లో పూర్తి నివేదిక అందజేస్తామని తెలిపారు. కాగా అధికారుల బృందం ప్రశ్నించినప్పుడు గోదాములో పని చేస్తున్న ఉద్యోగులు తమకేమీ తెలియదని సమాధానం ఇచ్చినట్లు సమాచారం. వేల బస్తాల బియ్యాన్ని పెద్దలు తిన్నారో, పందికొక్కులు తిన్నాయో అధికారులే తేల్చాలి.

దివ్యాంగులకు భరోసా

- వంద శాతం రాయితీతో త్రీ వీలర్ మోటారు వాహనాలు
- అన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ ● ఈ నెల 30 వరకు గడువు

చేజర్ల, నవంబరు 26(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు అండగా నిలుస్తోంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే దివ్యాంగుల పింఛను మొత్తాన్ని ఆరు వేల రూపాయలకు పెంచింది. దివ్యాంగులకు సంబంధించిన మోటారు సైకిళ్లకు 50 శాతం పెట్రోలు రాయితీ ఇస్తోంది. తాజాగా లక్షా ఇరవై వేల రూపాయలు విలువ చేసే మూడు చక్రాల మోటారు వాహనాలను వంద శాతం రాయితీతో ఉచితంగా అందజేయనుంది. అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 30 వరకూ పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జిల్లాలో అర్హులైన దివ్యాంగులకు ఉచితంగా రెట్రోఫిట్ త్రీ వీలర్ మోటారు వాహనాలు అందించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. పదో తరగతి ఉత్తీర్ణులై స్వయం ఉపాధి పొందుతున్న, ప్రైవేటు ఉద్యోగం చేస్తున్న విభిన్న ప్రతిభావంతులకు ఈ వాహనాలను ఉచితంగా అందజేయనుంది. డిగ్రీ, పీజీ చదువుతున్న విద్యార్థులు కూడా వీటిని పొందవచ్చు. ఈ నెల 30 లోగా డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.ఏపీడీఏఎస్‌సీఏసీ.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సంభందిత అధికారులు తెలియజేస్తున్నారు. జిల్లాకు మొత్తం 70 వాహనాలు మంజూరు అయినట్లు విభిన్న ప్రతిభా వంతుల శాఖ ఏడీ ఆయుబ్ పేర్కొన్నారు.



అర్హతలు...

- ఒకటి లేదా రెండు కాళ్ళు ప్రభావితమై 70 శాతం వైకల్యం ఉన్నవారు.
- రెండు చేతులు సక్రమంగా ఉండాలి.
- 18 నుంచి 45 సంవత్సరాలలోపు వయసు ఉండాలి.
- ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ద్వారా ఇంతకు ముందు వాహనం తీసుకోకుండా ఉండాలి.
- డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరి.
- వార్షిక ఆదాయం మూడు లక్షల లోపు ఉండాలి.
- తెల్లరేషను కార్డు తప్పనిసరి.
- ఆధార్, రేషన్ కార్డు, 10వ తరగతి మార్కుల లిస్ట్, వైకల్యానికి సంబంధించిన సదరం సర్టిఫికెట్, క్యాస్ట్, ఇన్‌కమ్ సర్టిఫికేట్, ప్రస్తుతం అందుతున్న పింఛను పుస్తకం ఉండాలి.
- డ్రైవింగ్ లైసెన్స్, ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్, అంగవైకల్యం చూపే విధంగా ఉన్న ఫొటోను జత చేస్తూ సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విద్యార్థులతో జాయింట్ కలెక్టర్, డీఈవో, అధికారులు

నెల్లూరు(విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా శారీరకంగా, మానసికంగా సంసిద్ధం కావాలని జాయింట్ కలెక్టర్ ఎం.వెంకటేశ్వర్లు అన్నారు. జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలోని పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలను బుధవారం ఆయన కలెక్టరేట్‌లో అభినందించి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రాధాన్యత, గొప్పతనం గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. యువత దేశంలో స్వేచ్ఛగా అన్ని రంగాల్లో రాణించేందుకు రాజ్యాంగం ఎంతో దోహదం చేస్తుందన్నారు. పౌరులు తమ హక్కులను వినియోగించుకోవడంతో పాటు రాజ్యాంగంలో పేర్కొన్న బాధ్యతలను కూడా తప్పక పాటించాలని తెలిపారు. డీఈవో డాక్టర్ ఆర్ బాలాజీరావు మాట్లాడుతూ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పోటీలను నిర్వహించి ప్రథమ స్థానం సాధించిన వారిలో నియోజకవర్గానికి ఒకరి చొప్పున అమరావతిలో జరిగిన మాక్ అసెంబ్లీకి పంపించామన్నారు. తర్వాత స్థానాల్లో నిలిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జిల్లాస్థాయిలో బహుమతులు అందచేస్తున్నామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్యాంగం మేధస్సు సమ్మేళనం

● జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్

నెల్లూరు (లీగల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) భారత రాజ్యాంగం గొప్ప మేధావుల, స్వాతంత్ర్య సమర యోధుల, న్యాయ నిపుణుల మేధస్సు సమ్మేళనమని జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ అధ్వర్యంలో జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవా సదన్ భవన్‌లో భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవం నిర్వహించారు. అయన మాట్లాడుతూ 2 సంవత్సరాల 11 నెలల 18 రోజులపాటు జరిగిన చర్చల్లో, 11 సమావేశాల్లో 165 రోజులపాటు సభ్యులు అత్యంత శ్రద్ధతో ప్రతి ఆర్టికల్‌ను పరిశీలించారని, చివరకు నవంబరు 26, 1949న రాజ్యాంగం ఆమోదం పొంది, జనవరి 26, 1950న అమలులోకి వచ్చిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరి కే వాణి, న్యాయాధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు. అలాగే బార్ అసోసియేషన్ అధ్వర్యంలో కూడా న్యాయవాదులు భారత రాజ్యాంగ అవతరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు.

చింతలపాలెంలో టీడీపీ నేత దారుణ హత్య

- కోళ్లఫారంలో కత్తులతో పొడిచి హతమార్చిన ఆగంతుకులు
- పోలీసుల ముమ్మర దర్యాప్తు
- నిందితుల కోసం ప్రత్యేక బృందాలు
- రాజకీయాలకు సంబంధం లేదు : డీఎస్పీ

జలదంకి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చింతలపాలెం గ్రామంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు టీడీపీ నాయకుడు గొట్టిపాటి ప్రసాద్ నాయుడు (58)ను దారుణంగా హత్య చేశారు. కోళ్లఫారంలో ఉన్న ఆయన్ను కత్తులతో ఆరుచోట్ల పొడిచి హతమార్చారు. అనంతరం దుండగులు ప్రసాద్ నాయుడు ముఖంపై ఓ గోతాము కప్పి పరారయ్యారు. పోలీసుల కథనం మేరకు..

గట్టుపల్లి పంచాయతీ చింతలపాలెంలో ఇటీవల చనిపోయిన ఓ వ్యక్తికి బుధవారం ఉదయం కర్మక్రతువులు జరిగాయి. శ్మశానానికి ఎదురుగానే మృతుడు ప్రసాద్ నాయుడుకు చెందిన కోళ్లఫారం ఉంది. వచ్చిన వారంతా బంధువులు కావడంతో అందరితో ప్రసాద్‌నాయుడు మాట్లాడి వెళ్లిపోయారు. ఆ తర్వాత తన స్నేహితుడు వేణుతో కలిసి ప్రసాద్ నాయుడు కోళ్లఫారంలో ఉండగా 11.20 గంటల ప్రాంతంలో ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి 5 కిలోల కోళ్లు కావాలని అడిగి బేరం కుదుర్చుకుని ఇప్పుడే వస్తామని వెళ్లిపోయారు. కాసేపటికి వేణు కూడా ఇంటికి వెళ్లిపోయాడు. రైసుమిల్లు నుంచి వడ్లపొట్టు తీసుకురావడం కోసం ట్రాక్టర్ డ్రైవర్ గంగాధర్ 12 గంటల ప్రాంతంలో కోళ్లఫారం వద్దకు వచ్చాడు. ఫోన్ చేసినా ప్రసాద్ నాయుడు తీయకపోవడంతో లోపలకు వెళ్లిచూడగా, ప్రసాద్‌నాయుడు రక్తపుమడుగులో పడి ఉన్నాడు. వెంటనే ఆయన గ్రామస్థులకు ఫోన్ చేసి విషయం తెలపడంతో అందరూ పరుగున కోళ్లఫారం వద్దకు చేరుకున్నారు. ప్రసాద్ నాయుడు మెడ, గుండె, పొట్ట భాగాలలో ఆరు చోట్ల కత్తులతో పొడిచి దారుణంగా హత్య చేసినట్లు గుర్తించారు. కావలిలో ఉంటున్న సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడు ఘటనాస్థలికి చేరుకుని బోరున విలపించాడు. కావలి డీఎస్పీ శ్రీధర్, కలిగిరి సీఐ వెంకటనారాయణ, జలదంకి ఎస్‌ఐ లతీఫున్నీసా తమ సిబ్బందితో కోళ్లఫారం వద్దకు చేరుకుని ఘటనాస్థలిని పరిశీలించారు. అనంతరం కుటుంబసభ్యులను, గ్రామస్థులను విచారించిన పోలీసులు హత్యకు గల కారణాలు, అనుమానితుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంల నిందితుల ఆనవాళ్లను సేకరించారు. నిందితులను పట్టుకునేందుకు పోలీసు అధికారులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ప్రాథమిక పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. కాగా, హత్యకు గురైన ప్రసాద్‌నాయుడు భార్య లక్ష్మీ ప్రసన్న చెన్నైలో నివాసం ఉంటుండగా ఇద్దరు కుమార్తెలు వాసవి, తేజస్వినిలకు వివాహమై స్వీడన్ దేశంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటున్నారు.



ఘటనాస్థలిలో ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, డీఎస్పీ శ్రీధర్ ఇతర పోలీస్ అధికారులు

● ఆ ఇద్దరు ఎవరు!?

కోళ్ల కోసం వచ్చిన ఆ ఇద్దరు ఎవరనేది మిస్టరీగా మారింది. ఆ ఇద్దరే ఈ ఘాతుకానికి పాల్పడి ఉంటారా!? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు. డీఎస్పీ శ్రీధర్ మాట్లాడుతూ ప్రసాద్‌నాయుడు హత్య బయట వ్యక్తుల పనేనని స్పష్టం చేశారు. ఇది రాజకీయ హత్య కాదని, వ్యక్తిగత హత్యగా భావిస్తున్నట్లు తెలిపారు. అన్ని కోణాల్లో విచారించి నిందితులను పట్టుకుంటామని స్పష్టం చేశారు.

● 20 ఏళ్లుగా క్రియాశీలక రాజకీయాల్లో..

గట్టుపల్లి పంచాయతీ రాజకీయాలలో మృతుడు ప్రసాద్ నాయుడు గత 20 ఏళ్ళకు పైబడి క్రియాశీలకంగా వ్యవహరిస్తున్నారు. ఆయన తండ్రి జనార్దన్ నాయుడు సర్పంచ్‌గా, తల్లి ఇందిరమ్మ ఎమ్పీటీసీ సభ్యురాలిగా, సోదరుడు వెంకటేశ్వర్లు నాయుడు సొసైటీ అధ్యక్షుడిగా ఉన్నకాలంలో అన్ని రాజకీయ వ్యవహారాలు ప్రసాద్‌నాయుడు చూస్తూ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండేవారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా ముందుండి పరిష్కరించేవాడని గ్రామస్థులు తెలిపారు.

● ఎమ్మెల్యేల సంతాపం

టీడీపీ నేత గొట్టిపాటి ప్రసాద్‌నాయుడు హత్య జరిగిన విషయం తెలుసుకున్న కావలి ఎమ్మెల్యే కావ్య క్రిష్ణారెడ్డి చింతలపాలెం చేరుకున్నారు. మృతదేహాన్ని పరిశీలించి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం వ్యక్తం చేశారు.



నిందితుల కోసం డాగస్క్వాడ్ వేట

ఏఆర్ కానిస్టేబుల్‌కు ఎస్పీ అభినందన



ఏఆర్ కానిస్టేబుల్ చరణ్‌తేజను అభినందిస్తున్న ఎస్పీ అజిత వేజెండ్ల

నెల్లూరు(క్రైం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ఆల్ ఇండియా పోలీస్ జూడో క్లస్టర్ గేమ్స్-2025లో పెన్‌కాక్ సిలాట్ విభాగంలో బంగారు పతకం సాధించిన నెల్లూరు ఏఆర్ కానిస్టేబుల్ కే చరణ్‌తేజను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈ ఏడాది అక్టోబరు నెలలో జమ్మూకశ్మీర్‌లో జరిగిన ఈ పోటీలో బంగారు పతకం సాధించడం అభినందనీయమన్నారు.

క్షయ నివారణ కార్యక్రమాలు 100 శాతం పూర్తి చేయాలి : కోర్ కమిటీ

నెల్లూరు (వైద్యం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయ వ్యాధి నివారణ కార్యక్రమాలు వచ్చే మూడు నెలల్లో 100 శాతం పూర్తి చేసేలా కార్యాచరణతో ముందుకు వెళ్లాలని కోర్‌కమిటీ తీర్మానించింది. బుధవారం ఏసీ సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్య కళాశాలలో కోర్ కమిటీ సమావేశం జరిగింది. ఆ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, పల్మనాలజీ హెచ్‌వోడీ అరుణ, జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి ప్రసంగించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం సజావుగా జరిగేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రేవతి, వివిధ విభాగాల హెచ్‌వోడీలు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజు అందజేత

మర్రిపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజును బుధవారం బూదవాడ సొసైటీ అధ్యక్షుడు వనిపెంట సుబ్బారెడ్డి చేతుల మీదగా ప్రధానోపాధ్యాయులకు అందజేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 310మంది విద్యార్థులకు టీడీపీ నేత బిజివేముల సురేంద్రనాథ్‌రెడ్డి సొంత నిధులతో పరీక్ష ఫీజును ప్రతినిధులచే స్థానిక ఎంఈవో కార్యాలయంలో ఆయా ప్రధానోపాధ్యాయులకు నగదును అందించారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 12077
వెండి కిలో ధర	రూ. 163600
వెండి ఒక గ్రాము	రూ. 168.60

న్యూస్ బాక్స్

గ్రామీణ ప్రాంతాల పురోగతికి అంకితభావంతో పనిచేస్తా

● ఏపీఐఐసీ డైరెక్టర్ కంచర్ల



మాట్లాడుతున్న ఏపీఐఐసీ డైరెక్టర్ కంచర్ల మాధవి

ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల పురోగతికి అంకితభావంతో పనిచేస్తానని ఏపీఐఐసీ డైరెక్టర్ కంచర్ల మాధవి తెలిపారు. బుధవారం ఆమె మంగళగిరిలోని ఏపీఐఐసీ కార్యాలయంలో డైరెక్టర్‌గా పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలోని నారంపేట గ్రామ సర్పంచ్‌గా ఉన్న తనను ఏపీఐఐసీ డైరెక్టర్‌గా నియమించిన కూటమి ప్రభుత్వం నమ్మకాన్ని వమ్ము చేయనన్నారు. తనపై విశ్వాసాన్ని ఉంచి పదవిని కట్టబెట్టిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారాలోకేష్, ఆనం రామనారాయణరెడ్డిలకు ధన్యవాదాలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలను, ప్రభుత్వ ఆశయాలను క్షేత్ర స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడమే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు.

నేడు కాకర్ల దంపతుల రాక

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నార్త్ కొండాయపాళెంలో గురువారం నిర్వహించే అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలకు శాసన సభ్యుడు కాకర్ల సురేష్ దంపతులు ముఖ్య అతిథులుగా పాల్గొంటారని టీడీపీ మండల కన్వీనర్ చంద్ర మధుసూదనరావు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఇటీవల గ్రామంలోని ప్రధాన రహదారి నుంచి ఎస్సీ కాలనీ వరకు నిర్మించిన సిమెంటు రోడ్డుతో పాటు తొడుగుపల్లి మీదుగా పామూరుపల్లి వరకు నిర్మించిన తారు రోడ్లను ప్రారంభిస్తారన్నారు. కావున అన్ని గ్రామాల నుంచి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు

సంగం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరమన పంచాయతీ మజరా జంగాలదొరువు గ్రామంలో కోదండరామస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీవాణి పథకం నుంచి రూ. 50 లక్షలు మంజూరైనట్లు మండల పార్టీ అధ్యక్షుడు బాజా శ్రీనివాసులురెడ్డి తెలిపారు. గ్రామంలోని పురాతన కోదండరామిస్వామి ఆలయం శిథిలస్థితికి చేరడంతో గ్రామస్థులు ఇటీవల దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి నూతన ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. దీంతో ఆయన స్పందించి టీటీడీ శ్రీవాణి పథకంలో రూ. 50 లక్షలు నిధులు మంజూరు చేశారు. ఆ మేరకు బుధవారం ఆయన స్థానిక నాయకులు గ్రామస్థులతో కలసి స్థలం పరిశీలించారు. శుక్రవారం భూమి పూజ చేయనున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

సంగం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముంబాయి జాతీయ రహదారిపై ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదారులకు సీఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరు హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీసులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన

సీతారామపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామ పంచాయతీలో తడి, పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాదరావు సూచించారు. మండల కేంద్రంలోని మారంరెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా వారు గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని గ్రీన్ అంబాసిడర్లకు సూచించారు.

పంటల పరిశీలన

ఉదయగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం చేసేలా రైతులను ప్రోత్సహించాలని ఆ పథకం జిల్లా మేనేజర్ రాజకుమార్, రాష్ట్ర రిసోర్సుపర్సన్ చక్రవర్తి సూచించారు. బుధవారం మండలంలోని గుడినరవ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో సాగు చేసిన పంటలను పరిశీలించి రైతులకు తగు సూచనలు అందజేశారు



ఆత్మకూరు: అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎంవీఐ రాములు, సిబ్బంది



సంగం: వివిధ వేషధారణలో విద్యార్థులు



ఏఎస్‌పేట: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు

వాడవాడలా ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ఆత్మకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం భారత రాజ్యంగ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఎంవీఐ రాములు, సిబ్బంది అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ప్రభుత్వ బాలుర, బాలికోన్నత పాఠశాలల్లో విద్యార్థులతో రాజ్యాంగ పీఠిక, రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. దాని విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె రాజశేఖర్‌రెడ్డి, డాక్టర్ ఎం ప్రసాద్, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

●**సంగం:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బుజ్జయ్య ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం 100 అడుగుల భారీ జాతీయ జెండాను చేతపట్టి విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో విద్యార్థులు అల్లూరు సీతారామరాజు, భారతమాత తదితర వేషధారణల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. అదేవిధంగా తహసీల్దారు కార్యాలయంలో, ఎంఈవో కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయా కార్యాలయాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

●**ఏఎస్ పేట:** స్థానిక ఠాగూర్ పాఠశాలలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి, హెచ్‌ఎం దొరస్వామిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**అనంతసాగరం:** మండలంలోని కామిరెడ్డిపాడు ఉన్నత పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులు, విదార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు నజీర్‌బాషా, భారతమ్మ పాల్గొన్నారు.

●**కలువాయి:** భారత రాజ్యంగ దినోత్సవం సందర్భంగా బుధవారం అంబేద్కర్ ధర్మ పోరాట సమితి ఆధ్వర్యంలో బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళర్పించారు. ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో ఆయన చిత్రపటాలకు పూలమాలలు వేసి రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో శైలజ, ఎస్ఐ కోటయ్య, వైద్యాధికారి విజయలక్ష్మి, ఏడీపీయస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిజమాల ప్రసాద్ పాల్గొన్నారు.

●**ఉదయగిరి:** భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా వైసీపీ కార్యాలయంలో అంబేద్కర్ చిత్ర పటానికి, అనంతరం అంబేద్కర్ భవన్ ఆవరణలో ఉన్న ఆయన విగ్రహానికి వైసీపీ నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ గోపికృష్ణ, పలు కళాశాలలు, పాఠశాలలు, కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ కొండా రాజగోపాల్‌రెడ్డి, సర్పంచ్ గౌస్‌మొహిద్దీన్, నాయకులు దస్తగిరిఅహ్మద్, అక్కి భాస్కర్‌రెడ్డి, పాల్గొన్నారు.

●**దుత్తలూరు:** స్థానిక తహసీల్దారు కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా కార్యాలయ ఆవరణలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి తహసీల్దారు యనమల నాగరాజు, ఉద్యోగులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మాక్ పోలింగ్, పార్లమెంట్ నిర్వహించారు. కేంద్రఎన్నికల సంఘం ఏవిధంగా ఎన్నికలు నిర్వహిస్తుందో అలాగే ప్రతి తరగతి నుంచి అభ్యర్థులను ఎన్నుకుని ఓటింగ్ చేపట్టారు.

●**వింజమూరు:** పట్టణంలోని సుబ్రహ్మణ్య నవోదయ సైనిక్‌స్కూల్ అకాడమీలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ రాజు విద్యార్థులకు రాజ్యాంగం, విలువలను వివరించారు. వేడుకల్లో అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

●**సీతారామపురం** స్థానిక సచివాలయంలో ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సచివాలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శివప్రసాదరావు పాల్గొన్నారు.



కలువాయి: ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు.



వింజమూరు : అంబేద్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సీతారామపురం: బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో చంద్రశేఖర్

డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలి

● మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ఆరికట్ల

మర్రిపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పరిమిత పంట - అధిక లాభాల పంట అనే సూత్రంతో రైతులు డిమాండ్ ఆధారిత పంటలు సాగు చేయాలని ఆత్మకూరు మార్కెటింగ్ కమిటీ చెర్మన్ ఆరికట్ల జనార్ధన్ నాయుడు సూచించారు. బుధవారం ఇర్లపాడులో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏపీఏఎంఎస్ యాప్ ద్వారా రైతులు తమ పంట సాగును నమోదుచేసుకోవాలని, పంటకు ఏ తెగులు సంభవించినా ఆ యాప్ ద్వారా ఆ పంటపై ఉన్న పురుగును ఫోటో తీయగానే ఏరకం తెగులు, నివారణకు ఏ మందు వాడాలో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కవిత, టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, కొండయ్య, రవీంద్రరెడ్డి, సురేష్, శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.

●**సీతారామపురం :** రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని జిల్లా ప్రకృతి వ్యవసాయ పథకం మేనేజర్ రాజకుమార్ అన్నారు. బుధవారం నెమల్లదిన్నెలో రైతన్న మీకోసం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ నాణ్యమైన ఉత్పత్తులు పండించాలంటే ప్రకృతి వ్యవసాయం సరైన మార్గం అన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రంగనాయుడుపల్లిలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా 30 రకాల గింజలతో పంట వేసిన సుల్తానాబేగం పొలం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి డివిజన్ ప్రకృతి వ్యవసాయం సలహాదారులు రామమోహన్, చక్రవర్తి, మండల వ్యవసాయాధికారి చెన్నరెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

కలువాయి : కలువాయిలో బుధవారం రైతన్నా మీకోసం కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారులు, నాయకులు ఇంటింటికి వెళ్లి రైతులకు అందిస్తున్న పథకాలను వివరించి కరపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చల్లా కళారాణి, టీడీపీ మండల కన్వీనర్ చల్లా రఘురామిరెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షులు జగదల్ నాయుడు, గడ్డం కిషోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మర్రిపాడు: కరపత్రాలు పంచుతున్న ఏఎంసీ చైర్మన్, వ్యవసాయాధికారులు

అంతదూరం కష్టమబ్బా!

(5వ పేజీ తరువాయి)

తిరుపతి జిల్లాలో కలపాలని ప్రతిపాదించారు. అయితే దీనిపై ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చి, ఉద్యమించారు. అప్పటి వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి కూడా ఈ ఉద్యమానికి మద్దతు ఇస్తూ ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంతో కలువాయిని నెల్లూరు జిల్లాలోనే ఉంచారు. అయితే, ఇప్పుడు మళ్లీ తిరుపతి జిల్లాలో చేర్చనున్నట్లు మంత్రివర్గ ఉపసంఘం ప్రతిపాదించడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రాపూరుపై మిశ్రమ స్పందన

(5వ పేజీ తరువాయి)

వెంకటగిరి నియోజకవర్గంలోని మూడు మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించేలా అప్పటి ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నెల్లూరు పరిధిలో ఉన్న రాపూరును తిరుపతి జిల్లాలో విలీనం చేయడాన్ని కొందరు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నెల్లూరుకు 60 కి.మీ దూరం ఉండగా, తిరుపతికి 90 కి.మీ ఉంటుందని, ప్రయాణ సౌలభ్యం అసౌకర్యంగా ఉంటుందని, ప్రజాభిప్రాయం మేరకు నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు సైదాపురం మండలాన్ని కూడా నెల్లూరులోనే ఉంచాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

రెవెన్యూ సమస్యలు ఎదుర్కొంటాం!



కండలేరు జలాశయం ముంపు గ్రామాల సమస్యలను 40 సంవత్సరాలుగా ఎదుర్కొంటూనే ఉన్నాం. గూడూరు రెవెన్యూ డివిజన్‌లో రాపూరు మండలాన్ని కలపడం వల్ల రెవెన్యూ రికార్డుల పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటాం. అందువల్ల నెల్లూరు జిల్లాలోనే రాపూరును కొనసాగించాలి.

\- సయ్యద్, మండల కో-ఆప్షన్ సభ్యుడు

నెల్లూరే అన్ని విధాలా సౌకర్యం



ఏవిధమైన కార్యకలాపాలకు అయినా రాపూరు ప్రజలందరికీ నెల్లూరు జిల్లా అనుకూలంగా ఉంటుంది. నెల్లూరుకు 60 కి.మీ దూరం ఉండగా సౌకర్యంగా, సౌలభ్యంగా ఉంటుంది. అయితే, తిరుపతికి 90 కి.మీ ఉన్నందున ఇబ్బందులు ఎదుర్కోవలసి ఉంటుంది.

\- ప్రసాద్, వ్యాపారి, రాపూరు

కలువాయిని నెల్లూరులో ఉంచాలి



కలువాయి మండలాన్ని నెల్లూరు జిల్లాలోనే ఉంచాలి. ఇక్కడ నుంచి తిరుపతికి కనీసం బస్సు సౌకర్యం కూడా సక్రమంగా లేదు. ఉన్నతాధికారులను కలసి ఇక్కడి సమస్యలను తెలిపాలన్నా 140 కి.మీ దూరం వెళ్లాలి. ఈ సమస్యను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకుపోతాము. ప్రభుత్వం కూడా పునరాలోచన చేయాలి.

\- పెరంకొండ మనోహర్, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి: సీఐటీయూ



ఉదయగిరిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ, రైతు సంఘం నాయకులు

ఉదయగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య పిలుపునిచ్చారు. కార్మికుల హక్కులను కాలరాస్తూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకిస్తూ బుధవారం స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా రైతు సంఘం నాయకుడు కాకు వెంకటయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేబర్, విద్యుత్ సవరణ చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ కాకు విజయమ్మ, సీఐటీయూ నాయకులు కోడె రమణయ్య, తిరుపతయ్య, కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, నాయబ్, రైతులు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బీమా ఉద్యోగుల నిరసన

ఆత్మకూరు: ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆత్మకూరులో ఎల్ఐసీ ఉద్యోగులు బుధవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు టి రమేష్, బ్రాంచ్ కార్యదర్శి ఎస్ శ్యామ్‌ప్రభాకర్ మాట్లాడుతూ ఏకపక్ష అప్రజాస్వామ్య లేబర్ కోడ్స్‌ను వెంటనే రద్దు చేయాలన్నారు. ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయిమెంటు విధానాన్ని ఉపసంహరించుకోవాలని, పని గంటల పెంపుదలను నిలుపుదల చేయాలని కోరారు. బీమా ఉద్యోగుల పలు సమస్యలను పరిష్కరించాలని, కార్మికుల ప్రయోజనాలను కాలరాసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బ్రాంచ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలి



ఉదయగిరి: ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఉదయగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములు కావాలని ఉదయగిరి ఏఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వీ శ్రీనివాసరావు, వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చల్లా వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం మండలంలోని వెంకట్రావుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు చేపట్టాలన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఏ రమణయ్య, శ్రీరాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

●**సీతారామపురం:** మండలంలోని నారాయణప్పపేట గ్రామంలో బుధవారం స్థానిక సీతారామ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఆరోగ్య సూత్రాలను పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతారామ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ నరసింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఉమాశంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వెంకటేష్, భాస్కర్‌రెడ్డి, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశ వాలంటీర్లు, బోధన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

సిగరెట్లు, పాన్ మసాలాల పట్టివేత



బాలాజీ నగర్‌లో పార్సిల్ సర్వీసులో పట్టుకున్న సిగరెట్ల బాక్సులు

నెల్లూరు (క్రైం), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బిల్లులు లేకుండా అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న సుమారు రూ. 20 లక్షల విలువైన సిగరెట్లు, పాన్ మసాలాలను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు బుధవారం పట్టుకున్నారు. అనంతరం వాటిని జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. విజిలెన్స్ అధికారుల వివరాల మేరకు.. అక్రమార్కులు ప్రభుత్వ ఖజానాకు గండికొడుతూ వివిధ రాష్ట్రాల నుంచి సిగరెట్లు, పాన్‌మసాలాలు దిగుమతి చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. నెల్లూరు నగరంలోని వెంకట రామా పురంలోని బీఎంపీఎస్ పార్శిల్ సర్వీస్‌లో పెద్ద ఎత్తున సిగరెట్లు, పాన్‌మసాలాలు రవాణా అవుతున్నాయని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అందిన సమాచారంతో విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ కే.నరసింహారావు, డీసీటీవో కే.విష్ణురావు, డీసీటీవో(జీఎస్టీ) ఎన్వీ సుబ్బారావులు తమ సిబ్బందితో పార్శిల్ సర్వీస్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అందులో భాగంగా 24 బాక్సుల సిగరెట్లు, మూడు బాక్సుల పాన్‌మసాలా ప్యాకెట్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా బిల్లులు లేకుండా తరలిస్తున్న సిగరెట్లు, పాన్‌మసాలా ప్యాకెట్లు ఎక్కడికి తరలిస్తున్నారు, ఎవరు ఎవరి పేరుపై బుక్ చేశారు, ఇలా అనేక వివరాలపై అధికారులు ట్రాన్స్‌పోర్టు కార్యాలయ సిబ్బందిని ప్రశ్నించారు. అయితే వారు తమ వద్ద ఫోన్ నెంబరు మాత్రమే ఉందని, ఇతర వివరాలు లేవని సమాధానం ఇచ్చారు. దీంతో విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.20 లక్షల విలువ చేసే సిగరెట్లు, పాన్‌మసాలాలను తదుపరి విచారణ నిమిత్తం జీఎస్టీ కార్యాలయానికి తరలించారు. పట్టుబడిన సరుకు నకిలీవా, అసలైనవా గుర్తించేందుకు శ్యాంపిల్స్‌ను సేకరించి ల్యాబ్‌కు పంపుతున్నారు. ఫోన్ నెంబరు ఆధారంగా విజిలెన్స్ అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. చెన్నై నుంచి నర్సరావుపేటకు గుర్తు తెలియని వ్యక్తి బుక్ చేసినట్లు అధికారులు గుర్తించారు. పార్శిల్ కార్యాలయంలో ఏదైనా వస్తువును పార్శిల్ బుక్ చేసుకునే సమయంలో అక్కడి సిబ్బంది ఎక్కడికి పంపుతున్నారు.. వారి చిరునామా, ఫోన్‌నెంబరు వివరాలు సేకరించిన తర్వాత మాత్రమే బుకింగ్ చేసుకుంటారు. అవేమి లేకుండా కేవలం ఫోన్ నెంబరు ఆధారంగా పాన్‌మసాలాలు, సిగరెట్లు తరలింపుపై విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నారు. పార్శిల్ కార్యాలయ సిబ్బంది ప్రమేయంపై అధికారులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీ



చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్

ఇందుకూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముదివర్తిపాలెం గ్రామంలో రన్నింగ్‌లో ఉన్న ట్రాన్స్‌పార్మర్లలో గుర్తు తెలియని వ్యక్తులు ఏబీ స్విచ్ ఆపేసి లోపల ఉన్న ఆయిల్, రాగి వైర్లను మంగళవారం రాత్రి అపహరించారు. ఏబీ స్విచ్ లేని ట్రాన్స్ పార్మర్లను కూడా ఊడదీసి, ఆయిల్, రాగి వైరును చాకచక్యంగా దొంగిలించారు. ట్రాన్స్‌పార్మర్ గురించి పూర్తిగా తెలిసిన వ్యక్తులే ఇలాంటి దొంగతనాలు చేయగలరని విద్యుత్‌శాఖాధికారులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం నార్లు పోసుకునే సమయంలో ట్రాన్స్ పార్మర్లు చోరీకి గురి కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పోలీసు గస్తీ లేక పోవడం వల్లే తరచూ ఇలాంటి దొంగతనాలు జరుగుతున్నాయని రైతులు తెలిపారు. గుర్తుతెలియని వ్యక్తులు మాస్కులు ధరించి ద్విచక్ర వాహనాల్లో ఒంటరిగా వస్తున్న వారిని బెదిరిస్తున్నారని మండల ప్రజలు చెబుతున్నారు. పోలీసు అధికారులు రాత్రిళ్లు గస్తీ నిర్వహించేలా చర్యలు చేపట్టాలని, చోరీలను అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రైలు పట్టాలపై విద్యార్థి మృతదేహం

కావలి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోఆపరేటివ్‌కాలనీ సమీపం లో రైలు పట్టాలపై డిగ్రీ విద్యార్థి దద్దాల ఆకాష్ (19) మృతదేహాన్ని మంగళవారం రాత్రి గూడ్సు గార్డు గుర్తించి జీఆర్పీ పోలీసులకు సమాచారమందించాడు. మృతదేహాన్ని పరిశీలించిన జీఆర్పీ పోలీసులు వివరాలు వెల్లడించారు. ఉలవపాడు మండలం మన్నేటికోటకు చెందిన బాబురావుకు ముగ్గురు కుమారులు. వారి చదువుల కోసం పట్టణం లోని వెంగళరావునగర్‌లో నివాసం ఉంటున్నారు. మూడవ కుమారుడు ఆకాష్ స్థానిక ఎమ్మెస్సార్ కళాశాలలో డిగ్రీ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. సాయంత్రం ఇంటి నుండి వెళ్లిన ఆకాష్ తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు జీఆర్పీ పోలీసులను సంప్రదించారు. మార్చురీలోని మృతదేహాన్ని పరిశీలించాక ఆకాష్‌గా గుర్తించి కుటుంబసభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు. వ్యక్తిగత కారణాలతో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వరరావు తెలిపారు.

విద్యార్థిపై నవోదయ కోచింగ్ సెంటర్

నిర్వాహకుడి దాష్టీకం



విద్యార్థి కాలుపై పడ్డ వాతలు

ఉదయగిరి, నవం బరు 26 (ఆంధ్రజ్యో తి): ఉదయగిరి పట్టణంలోని బాలాజీ నగ ర్‌లో గల ప్రతిభ నవోదయ కోచింగ్ సెంటర్‌లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి జయంత్ రెడ్డిపై నిర్వాహకుడు అంజయ్య వాతలు పడేలా కొట్టిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకొంది. వివరాల మేరకు.. కలిగిరి పట్టణానికి చెందిన ఎం జయంత్ రెడ్డి నవోదయ కోచింగ్ కోసం ఉదయగిరిలోని ప్రతిభ నవోదయ కోచింగ్ సెంటర్‌లో చేరాడు. ఆ విద్యార్థి ఇక్కడే విద్యనభ్యసిస్తూ వసతిగృహంలో ఉంటున్నాడు. ఈ క్రమంలో కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు అంజయ్య విద్యార్థి కాలుపై కొట్టడంతో వాతలు పడ్డాయి. సమాచారం అందుకున్న విద్యార్థి తల్లిదండ్రులు, బంధువులు రాత్రి కోచింగ్ సెంటర్ వద్దకు వచ్చి నిర్వాహకుడిపై వివాదానికి దిగి ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాబుద్ధులు నేర్పమని పంపితే వాతలు పడేలా కొడ తారా.. అంటూ మండిపడ్డారు. నిర్వాహకుడికి కట్టిన ఫీజు వాపసు తీసుకుని జయంత్‌రెడ్డిని ఇంటికి తీసుకెళ్లారు.

ఆటో బోల్తా: ఇద్దరికి గాయాలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా వస్తున్న ఆటోలు ఢీకొనడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన బుధవారం తూర్పుబోయమడగల గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. వివరాల మేరకు.. కాంచెరువు గ్రామానికి రావూరి కొండయ్య తన ఆటోలో మనవడితో కలిసి పని నిమిత్తం వరికుంటపాడుకు వెళ్లాడు. అదే క్రమంలో తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న మరో ఆటో ఢీకొంది. దీంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో కొండయ్యతో సహా మనవడు సన్నీకి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వారిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఉదయగిరికి తరలించారు.

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	218
స్కిన్‌లెస్	242

కోడిగుడ్ల ధర (100): 660



ఆకట్టుకున్న మాక్ అసెంబ్లీ

కలిగిరి, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరిం చుకుని స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ముఖ్యమంత్రి, స్పీకర్, మంత్రులు, ఎమ్మెల్యేల పాత్రల్లో విద్యార్థినీ విద్యార్థులు ఆకట్టుకున్నారు. రాజ్యాంగ విశిష్టతను ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం విద్యార్థులకు మిఠాయిలు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

కందుకూరును ప్రకాశం జిల్లాలో విలీనం హర్షణీయం

● మాజీ ఎమ్మెల్యే శివరాం

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో విలీనం చేసేలా మంత్రివర్గ ఉపసంఘం సిఫార్సు చేయటం హర్షణీయమని కందుకూరు మాజీ ఎమ్మెల్యే డాక్టరు దివి శివరాం పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు భిన్నంగా అప్పటి వైసీపీ ప్రభుత్వం నియంతృత్వ పోకడలతో కందుకూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో విలీనం చేసి ప్రజలకు తీవ్ర అన్యాయం చేసిందని, అప్పట్లో రెండునెలలపాటు పెద్దఎత్తున ఆందోళనలు చేసినా ఫలితం లేకుండాపోయిందని గుర్తుచేశారు. అయితే ప్రజల బాగోగుల పట్ల చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్‌లు ప్రజలకు ఇచ్చిన మాట మేరకు ప్రకాశం జిల్లాలో విలీనం చేయించటం హర్షణీయమన్నారు. నియోజకవర్గ ప్రజల తరపున వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు శివరాం పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ఇంటూరి కృషి ఫలితమే

● బెజవాడ ప్రసాద్, జేఏసీ కన్వీనర్

కందుకూరు నియోజకవర్గాన్ని ప్రకాశం జిల్లాలో కలపాలన్న ఈప్రాంత ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులదేనని జేఏసీ కన్వీనర్ బెజవాడ ప్రసాద్ పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, యువనేత నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకునేలా కృషిచేసి ఎమ్మెల్యే సఫలీకృతుడయ్యాడని తెలిపారు.

అనివేటి మండపం నిర్మాణానికి విరాళం

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కందుకూరు గ్రామదేవత అంకమ్మ ఆలయ పునర్నిర్మాణం కోసం పట్టణానికి చెందిన చల్లా మధుసూదనరావు, రమాదేవి దంపతులు రూ. 25116 విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ పునర్నిర్మాణ కమిటీ సభ్యులు పిడికిటి వెంకటేశ్వర్లు, మంచిరాజు మురళీమోహన్‌కు ఆలయ ప్రాంగణంలో బుధవారం అందజేశారు.

'రైతన్నా మీ కోసం' కరపత్రాల పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కావలి రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చౌదరిపాళెంలో స్థానిక టీడీపీ నాయకుడు గోరంట్ల రాంబాబు ఆధ్వర్యంలో బుధవారం 'రైతన్నా మీ కోసం' కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డి ఆదేశాల తో సోమశిల నీటిని చెరువులకు మళ్లించి, సాగు, తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టారన్నారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు పోకూరి రాంబాబు, గొంది వెంకటేశ్వర్లు, బత్తుల రవి, మండువ శ్రీనివాసులు, కంటు రమేష్‌బాబు, చిడిపోతు వెంకటేశ్వర్లు, మండువ శ్రీనివాసులు, కంటు గణేష్, రైతులు పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ



చుండి సచివాలయంలో సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలిస్తున్న ఎంపీడీవో శంకర్‌రావు

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వ సేవలు అందించాలని ఎంపీడీవో శంకర్‌రావు సూచించారు. మండలంలోని చుండి గ్రామ సచివాలయాన్ని బుధవారం ఎంపీడీవో తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టరును పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సర్వేలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ సిబ్బంది పాల్గొన్నారు.

'క్లీన్ విలేజ్- గ్రీన్ విలేజ్' పై శిక్షణ

కావలి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో 'క్లీన్ విలేజ్ - గ్రీన్ విలేజ్'పై జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

కావలి (టౌన్) నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవం బుధవారం పట్టణంలో ఘనంగా జరిగింది. బీజేపీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బ్రిడ్జి కూడలి ట్రంకు రోడ్డులో గల అంబేద్కర్ విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బీజేపీ సీనియర్ నాయకులు కుట్టుబోయిన బ్రహ్మానందం, ఏపీ జీఎస్టీ మండలి సభ్యులు అమరా సుబ్బారావు భారత రాజ్యాంగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు మంద కిరణ్, సుందరశెట్టి సుజి, సుధాకర్, వాయుగండ్ల సుధీర్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జేబీ డిగ్రీ కళాశాలలో...

స్థానిక జేబీ డిగ్రీ కళాశాలలో రాజ్యాంగ దినోత్సవ సభ నిర్వహించారు. రాజనీతి శాస్త్రం విభాగాధిపతి నాగేశ్వరరావు, విశ్రాంత చరిత్ర అధ్యాపకులు డాక్టర్ కృష్ణప్రసాద్‌లు మాట్లాడుతూ రాజ్యాంగం కేవలం ఓ పుస్తకం కాదని, విలువలకు మార్గదర్శకమైన పవిత్ర గ్రంథమన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుబ్రమణ్యం నాయుడు, స్వయం ఉపాధి కోర్సుల సంచాలకులు డాక్టర్ మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

డీబీఎస్ కళాశాలలో...

స్థానిక డీబీఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ టీవీ రావు అధ్యక్షతన జరిగిన రాజ్యాంగ దినోత్సవ సభలో ప్రొఫెసర్ దేవ కుమార్ పాల్గొని రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ సుధీర్‌నాయుడు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



అంబేద్కర్, గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎమ్పీడీవో, సిబ్బంది

● **రాజ్యాంగం అమలుకు పోరాడుదాం**

కావలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని హక్కుల పరిరక్షణకు పోరాడాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి పేర్కొన్నారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా నిరసన తెలిపారు. అంబేద్కర్ రాజ్యాంగం సక్రమంగా అమలయ్యేలా బడుగు వర్గాలు పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యానాది సమాఖ్య అధ్యక్షురాలు బాపట్ల సత్యవతమ్మ, దళిత నాయకులు విజయరత్నం, వాసు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

● **ఎంపీడీవో కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవం**

కావలి రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కావలి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో బుధవారం భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కావలి : అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనతెలుపుతున్న దళితనేతలు

నిబంధనలు పాటించాలి

కొండాపురం, నవంబరు26 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని బుధవారం మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆదినారాయణరావు ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ నడుచుకోవాల్సి ఉందన్నారు. సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాక్ అసెంబ్లీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసరావు, మండల టీడీపీ కన్వీనర్ పోలినేని చంద్రబాబునాయుడు, ఏవో శేషసాయి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఒక వర్గానికే పరిమితం కాదు

అల్లూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత రాజ్యాంగ రూపకర్త, ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించిన మహానేత అంబేద్కర్ అని, ఆయనను ఒకే వర్గానికి పరిమితం చేయడం సరికాదని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు అన్నారు. రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం అల్లూరు పాతబస్టాండు కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఆయన నివాళులర్పించారు. 2015లో రాజ్యాంగ దినోత్సవాన్ని జాతీయ దివస్‌గా నామకరణం చేసిన నేపథ్యంలో ప్రతీ ఒక్కరం పండుగలా జరుపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గంగపట్నం సతీష్, బుట్టి నిరంజన్, కాకాని యశ్వంత్ కుమార్, చెంతాటి బబ్లు, కలిచేటి వెంకటేష్, నేతగాని వికాస్, నేతగాని విక్కి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు నివాళి

కందుకూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగదినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇతర టీడీపీ నేతలతో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బెజవాడ ప్రసాదు, అల్లం వెంకటేశ్వర్లు, షేక్ రూబీ, కొత్తూరి వెంకటసుధాకర్, చుండూరి శ్రీనివాసరావు, శ్రీధర్, కళ్యాణ్, శివ తదితరులు పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలోనూ ఆపార్టీ స్థానిక నాయకులు భారత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించి అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాజనీతి శాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టరు ఏడుకొండలు నరేంద్ర, అధ్యాపకులు పి. రాజగోపాలబాబు, ఎస్వీ శ్రీహరి, కె.సుజాత, డాక్టరు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బీటీపీ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక అంబేడ్కర్ విగ్రహం సెంటర్‌లో నిర్వహించారు. ఈ సం దర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీటీపీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు కల్లగుంట మోహనరావు, డివిజన్ అధ్యక్షుడు షేక్ అబ్దుల్లా, నాయకులు చొప్పర కొండలరావు, మెండా వెంకటరావు, తలారి శేషా రావు, మాజీ కౌన్సిలర్ రేణమాల అయ్యన్న పాల్గొన్నారు.

● ఉలవపాడు : భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు మండలంలోని ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల్లో ఘనంగా జరుపుకున్నారు. తహసీల్దార్ శ్రీనివాసులు రెవెన్యూ కార్యాలయంలో, ఎంపీడీవో సురేష్ మండల పరిషత్ కార్యాలయంలో, ఎసై అంకమ్మ స్థానిక పోలీస్ స్టేషన్‌లో, పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

రాజ్యాంగం విశిష్టతను తెలుసుకోవాలి

లింగసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు, ఆర్ఐ ఎం రమణయ్య, సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగం విశిష్టత, హక్కుల గురించి తహసీల్దార్ కోటేశ్వరరావు వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు వీఆర్ఓలు, సర్వేయర్లు, సిబ్బంది, టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం : మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ దినోత్సవం బుధవారం ఘనగా నిర్వహించారు. ఈ సందర్భంగా బి.ఆర్ అబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శంకర్‌రావు, డిప్యూటీ ఎంపీడీవో వెంకటనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేస్తున్న దళితులు



వలేటివారిపాలెం ఎంపీడీవో కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీవో, సిబ్బంది



టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తదితరులు



ఉలవపాడులో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది



లింగ సముద్రంలో అంబేడ్కర్‌కు నివాళి...

నాణ్యమైన విద్యే ప్రభుత్వ లక్ష్యం

● కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరారవు

లింగసముద్రం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో నిర్మించిన అనుబంధ వసతిగృహాన్ని ప్రిన్సిపాల్ షేక్ మహమ్మద్ హఫ్తార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల ఆవరణలోని సరస్వతి దేవి విగ్రహానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే పేద బాలికలు 9వ తరగతి నుంచి సీనియర్ ఇంటర్ వరకు 40 మంది ఇందులో ఉండి చదువుకునేందుకు సౌకర్యం కల్పించబడిందన్నారు. రాబోయే రోజుల్లో మరి కొంతమందికి ఈ హాస్టల్‌లో సౌకర్యం కల్పిస్తామన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఎస్ఏ ప్రాజెక్టు సహాయ కోఆర్డినేటర్ డి వెంకటేశ్వర్లు, జిల్లా బాలికల అభివృద్ధి అధికారి మమత, ఎంఈఓ 1, 2 లు కె మాల్యాద్రి, ఎంవి శివకుమార్, మండల టీడీపీ అధ్యక్షుడు పి గురునాథం, ఎస్ఎంసీ చెర్మన్ యు మధు, తహసీల్దార్ ఎం కోటేశ్వరరావు, ఎంపీడీఓ కె శ్రీనివాసులు, ఎంపీటీసీ డి వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు పి చిననాగిరెడ్డి, ఎస్ బ్రహ్మారెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో మానవతా విలువలు పెంచాలి

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో మానవతా విలువలు పెంచాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. మండలంలోని చుండి మోడల్‌స్కూల్‌లో హాస్టల్ భవనాన్ని బుధవారం పునఃప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన మధ్యాహ్న భోజనం అమలవుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్టు కమిషనర్ డి వెంకటసుబ్బయ్య, డిసిడిపో మమత, మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్, మండల టీడీపీ అధ్యక్షుడు మాదాల లక్ష్మీనరసింహం, నాయకులు చెరువుపల్లి మాల్యాద్రి, కామినేని అశోక్, కామినేని వీరయ్య, చెరువుపల్లి సాంభశివరావు, తదితరులు పాల్గొన్నారు.



తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో బాలికల వసతి గృహం శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

లేబర్ కోడ్‌లు ఉపసంహరించుకోవాలి

● సీఐటీయూ నిరసన

వలేటివారిపాలెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే నాలుగు లేబర్ కోడ్‌ల నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకో వాలని సీఐటీయూ జిల్లా నాయకుడు కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వలేటివారిపాలెంలో సీఐటీయూ కార్యకర్తలతో కలిసి బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో గౌస్‌బాషా, సరస్వతి, చెంచులక్ష్మీ, సంపూర్ణ, మల్లిక, సుజాత, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

● ఉలవపాడు : కార్మికుల హక్కులను హరించే లేబర్ కోడ్ నోటిఫికేషన్‌ను తక్షణమే రద్దు చేయాలని మండల సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకుడు జీవీబీ కుమార్ మాట్లాడుతూ కార్మికులకు నష్టం చేకూర్చే లేబర్ కోడ్‌లను రద్దు చేయకుంటే ఆందోళనకు పూనుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కోకన్వీనర్ సీహెచ్ ఇందిరావతి, మండల కోశాధికారి నాశం శ్రీదేవి, సహాయ కార్యదర్శి వాకా లతారెడ్డి, కమిటీ సభ్యులు వసంత, మహిత పాల్గొన్నారు.

ఆ కోడ్లు రద్దు చేయాలి

కావలి (టౌన్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేసిన నాలుగు లేబర్ కోడ్ల నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని బుధవారం స్థానిక ట్రంకు రోడ్డులో కార్మిక సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో కార్మికులు నిరసన ర్యాలీ నిర్వహించారు. సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్‌కె రెహనాబేగం మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులు కాలరాసేందుకు 29 కార్మిక చట్టాలను సవరించి 4 లేబర్ కోడ్లు తీసుకొచ్చిందన్నారు. కార్మికులు ఎన్నో పోరాటాలు త్యాగాలు చేసి సాధించుకున్న హక్కులను కాలరాయడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఏఐటీయుసీ నాయకులు దుర్గాబాబు, శ్యామల, కరవది భాస్కర్, సీపీఎం నాయకులు పెంచలయ్య, ఏఐటీయుసీ నాయకులు బోసు, ఎస్‌డబ్ల్యుఎఫ్ కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



కావలి : నిరసన ర్యాలీలో పాల్గొన్న కార్మికులు

చంద్రమౌళి కుటుంబానికి న్యాయం చేయాలి

కలిగిరి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి చెందిన నల్లపనేని చంద్రమౌళి కుటుంబానికి న్యాయం చేయాలంటూ తొగురువారిపాలెం గ్రామస్తులు బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 17న కలిగిరి మండలం చిన్నచెరువు వద్ద ఆటోను ట్రాక్టరు ఢీకొన్న ఘటనలో తొగురువారిపాలెం గ్రామానికి చెందిన నల్లపనేని చంద్రమౌళి (63) అనే వృద్ధుడు తీవ్రంగా గాయపడి చెన్నైలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చంద్రమౌళి మృత దేహాన్ని కుటుంబసభ్యులు చెన్నై నుండి అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకెళ్తూ కలిగిరి పోలీస్‌స్టేషన్ వద్ద ఆగారు. ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకోకుండా, బాధ్యులపై చర్యలు తీసుకోకుండా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారని నిరసన వ్యక్తం చేశారు. చంద్రమౌళి కుటుంబానికి ట్రాక్టరు యజమాని పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ ఉమాశంకర్ మాట్లాడుతూ అంబులెన్స్‌తో పోలీసు స్టేషన్‌వద్దకు రావడం పద్ధతి కాదన్నారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని బాధితులకు తెలిపారు. నష్టపరిహారం అందించేందుకు ట్రాక్టర్ యజమాని అంగీకరించడంతో మృతదేహాన్ని స్టేషన్‌వద్ద నుండి స్వగ్రామానికి తీసుకెళ్ళారు.



ఎస్ఐ ఉమాశంకర్‌తో మాట్లాడుతున్న గ్రామస్థులు

ఏం చేద్దాం!

(5వ పేజీ తరువాయి)

ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. అంతేగాక మేయర్ చాంబరుతోపాటు పేషీ మరమ్మతు పనుల్లో వాస్తవ విరుద్ధంగా బిల్లులు పెట్టారన్న విమర్శలున్నాయి.

● **బిల్లులు వస్తాయా!?**

ప్రస్తుత ప్రభుత్వం మేయర్‌పై అవిశ్వాస తీర్మానం రాజకీయంగా దుమారం రేపుతోంది. ప్రధానంగా మేయర్ అనుచర దళం అనేక రూపాలలో పనులు చేసినట్లు బిల్లులు కార్పొరేషన్‌లో దాఖలు చేశారు. ఈ ప్రక్రియ వివిధ సెక్షన్ల వద్ద ఉంది. అన్నీ కలిపి సుమారు రూ.60 లక్షల వరకు బిల్లులు మేయర్ దళం నుంచి వెళ్లాయి. ఇవన్నీ మంజూరు అవుతాయా...? లేదా..? తిరిగి విజిలెన్స్ విచారణ జరుపుతారా...? అన్నది అయోమయంగా మారింది. అవిశ్వాసం చర్చ తెరపైకి వచ్చినప్పటి నుంచి ఆమె అనుచర దళం ఆందోళనకు గురవుతోంది. ఈ మేరకు అధికార పార్టీలో బిల్లులపై పునఃసమీక్షించాలన్న డిమాండ్ అధికారుల వద్దకు చేరడం గమనార్హం.

మాపై కక్షగట్టారు!

(5వ పేజీ తరువాయి)


గురి చేస్తున్నారని వాపోయారు. ఏదైన సమస్య ఉంటే తమతో నేరుగా ఎదుర్కోవాలని హితవు పలికారు. ఎందాకైనా పోరాటానికి, ప్రాణత్యాగానికి సంసిద్ధులమై ఉన్నట్లు చెప్పారు. ఇక్కడ జరుగుతున్న కీచక పర్వంపై టీడీపీ అధిష్ఠానం, ప్రభుత్వ పెద్దలు ఆరా తీయాలని విజ్ఞప్తి చేశారు. తమ పదవిపై డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ కన్నేశాడని, అనేక దఫాలుగా తమ వద్దకు వచ్చి సెలవుపై వెళ్లాలని, అలా వెళ్తే ఇన్‌చార్జి మేయర్‌గా ఉండవచ్చని తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చినట్లు చెప్పారు. తాము అభివృద్ధిని అడ్డుకుంటున్నామని రూప్‌కుమార్ చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వారు చెప్పినట్లు తాము అవినీతికి పాల్పడితే ఇప్పటివరకు చూస్తూ ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు.

ఘనంగా మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతి

కావలి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు మాజీ ఎంపీ మాగుంట సుబ్బరామిరెడ్డి జయంతిని బుధవారం కావలి పట్టణంలో టీడీపీ నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మాగుంట పార్వతమ్మ ట్రంకురోడ్డులో గల సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పార్టీలకతీతంగా పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తొలుత మాగంట మనవడు మాగుంట చిన సుబ్బరామిరెడ్డి తన అనుచరులతో మాగుంట విగ్రహానికి నివాళులర్పించారు. అనంతరం కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి టీడీపీ నాయకులతో కలిసి మాగుంట విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మాగుంట సుబ్బరామిరెడ్డి తన జీవితాన్ని ప్రజా సేవకు అంకితం చేశాడని కొనియాడారు. రాజకీయంగా తనను ఉన్నత స్థానంలో నిలబెట్టిన మాగుంట కుటుంబానికి ఎప్పటికీ రుణ పడి ఉంటానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కావలి ఏఎంసీ చైర్మన్ పోతుగంటి అలేఖ్య, టీడీపీ లీగల్‌సెల్ నియోజకవర్గ కన్వీనర్ గుంటుపల్లి రాజకుమార్ చౌదరి, జ్యోతి బాబూరావు, అమరావేదగిరి, తటవర్తి వాసు, దేవకుమార్, టీడీపీ, ఇతర ఇతర పార్టీల నేతలు పాల్గొన్నారు.




సుబ్బరామిరెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి, టీడీపీ నాయకులు



కల చెదిరింది

● గూడూరు గుండె బద్దలైంది

నిరాశలో నగరి ప్రజలు
వెంకటగిరి నిర్ణయం మీదా అసంతృప్తి
దిక్కుతోచని స్థితిలో నేతలు



గూడూరును ప్రత్యేక జిల్లాగా చేయకపోతే పోయారు.. కనీసం నెల్లూరుజిల్లాలో అయినా కలుపుతారని నమ్మిన ప్రజలు దిగ్ర్భాంతికి గురవుతున్నారు. నెల్లూరులో మళ్లీ విలీనం అయినట్టే అని రెండు రోజుల ముందు దాకా బలంగా ప్రచారం కూడా జరిగింది. నగరి నియోజకవర్గంలోని మూడు మండలాలను కూడా తిరుపతిలో కలుపుతారని ఆశ పడ్డారు. హఠాత్తుగా కథ ఎందుకు అడ్డం తిరిగిందో అర్థం కాక అందరూ సతమతమవుతున్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన అవకతవకల నిర్ణయాన్ని చంద్రబాబు సరిదిద్దుతారని ఆశపడ్డ ప్రజలు మరోసారి తీవ్ర నిరాశకు గురవుతున్నారు. పైగా వెంకటగిరి నియోజకవర్గంలో సుదూరంగా ఉండే మూడు మండలాలను తిరుపతిలో విలీనం చేయడం కూడా అక్కడి ప్రజలకు నచ్చడం లేదు. ఈ అసంతృప్తిని ఎలా ఎదుర్కోవాలో కూటమి నాయకులకు కూడా అంతుపట్టడం లేదు. ఈ నిర్ణయాలను పునఃసమీక్షించుకుని సరిదిద్దాలని ప్రజలు కోరుతున్నారు.

తిరుపతి/గూడూరు/వెంకటగిరి/నగరి, ఆంధ్రజ్యోతి

ప్రభుత్వానికి విన్నవించా

'గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలని ప్రభుత్వానికి మెయిల్ ద్వారా వినతిపత్రం పంపా. వైసీపీ ప్రభుత్వం గూడూరును తిరుపతి జిల్లాలో కలపంతో కలపడంతో ఇబ్బంది పడుతున్న ప్రజలు.. నెల్లూరుజిల్లాలోనే కలపాలని కోరుతున్నారు. దీనిపై చంద్రబాబు, లోకేశ్ కూడా హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల్లోనూ ప్రజల గళాన్ని వినిపించా. అందరి అభ్యర్థనను సీఎం చంద్రబాబు పరిగణనలోకి తీసుకుని, గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలపాలని విన్నవించా'నని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ తెలిపారు.

భగ్గుమంటున్న గూడూరు

అధికారంలోకి రాగానే గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలో కలుపుతాం

- 2023 జూన్‌లో కోటలో జరిగిన యువగళం బహిరంగ సభలో నారా లోకేశ్ హామీ ఇచ్చారు.
- 2024 ఏప్రిల్ 20న ఎన్నికల సందర్భంగా గూడూరులో నిర్వహించిన మహిళా సదస్సులో సీఎం చంద్రబాబునాయుడు కూడా సభాముఖంగా ఇదే ప్రకటన చేశారు.
- స్థానిక ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ కూడా అంశాన్ని ప్రజల ఆకాంక్షగా అసెంబ్లీలో ప్రస్తావించారు.
- నూతన జిల్లాల ఏర్పాటు, మండలాల పునర్విభజన ప్రక్రియపై చేసిన మథనం తర్వాత గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరుజిల్లాలోనే విలీనం చేయాలని మంత్రివర్గ ఉప సంఘం ఇటీవల ప్రతిపాదించింది.

ఏం జరిగిందో ఏమో కానీ, గూడూరు ప్రాంత ప్రజల కల చెదిరింది. కన్నీరు మిగిలింది.

గూడూరు నియోజకవర్గంలోని గూడూరు, చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల నుంచి 40 కిలోమీటర్ల లోపు దూరంలో నెల్లూరు ఉంటుంది. 30 నుంచి 40 నిమిషాల సమయంలో నెల్లూరుకు చేరుకోవచ్చు. జిల్లా కేంద్రంతో ఈ ప్రాంతం పెనవేసుకుని ఉండేది. గత వైసీపీ ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా 2022 ఏప్రిల్ నెలలో గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లా నుంచి విడదీసి నూతనంగా ఏర్పాటు చేసిన తిరుపతి జిల్లాలో విలీనం చేసింది. ఈ ప్రాంతాల నుంచి తిరుపతి జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 100 నుంచి 110 కిలోమీటర్ల వరకు.. 2 గంటలకుపైగా ప్రయాణం సాగించాలి. నెల్లూరు కంటే తిరుపతికి ప్రయాణ ఖర్చులు ఎక్కువ. నియోజకవర్గం నుంచి తిరుపతి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటే ఇటు ప్రజలు, అటు ఉద్యోగులు, వ్యాపారులు ఇబ్బందులు పడాల్సివచ్చేది. అప్పట్లో ఈ నిర్ణయాన్ని నియోజకవర్గ ప్రజలు వ్యతిరేకిస్తూ పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలను చేపట్టినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. ఎన్నికల్లో అందుకు తగిన మూల్యాన్ని ఆ పార్టీ చెల్లించుకోవాల్సి వచ్చింది. కూటమి ప్రభుత్వం ఈ తప్పును సరిదిద్దుతుందని ప్రజలు ఆశించారు. నెల్లూరులో కలపడం కాదు ప్రత్యేక జిల్లానే కావాలని డిమండ్‌ను తెరమీదకు తెచ్చారు. అయితే ఇప్పుడు మొదటికే మోసం వచ్చింది. ఇదిగో అయిపోయింది.. అదిగో పూర్తయ్యిందని ఇప్పటిదాకా ప్రజలకు నచ్చజెపుతూ వచ్చిన కూటమి నాయకులంతా ఇప్పుడేమి చెప్పాలా అని ఆందోళన చెందుతున్నారు. అధినేతా, యువనేతా ఇచ్చిన హామీలకే దిక్కులేకపోతే ఇక తమ మాటలను ప్రజలేం నమ్ముతారనే ఆవేదన కొందరు వ్యక్తం చేస్తున్నారు. సీఎం చంద్రబాబు, నారా లోకేశ్‌లు స్థానిక ప్రజల ఆకాంక్షలను పట్టించుకుని పునరాలోచించాలని కోరుతున్నారు. నెల్లూరులో కలపాలని కోరుతున్నారు.

అసంతృప్తిని మిగిల్చింది!



గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తారని ఇక్కడి ప్రజలు ఎంతో ఆశగా వున్నారు. ప్రభుత్వ నిర్ణయం ప్రజలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులకు తీవ్ర అసంతృప్తిని మిగిల్చింది.

- వై.సుబ్రమణ్యం రాజు, ఏపీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు

నెల్లూరుతోనే మా అనుబంధం



రోజువారీ విద్య, వైద్యం, వ్యాపారాలపరంగా నెల్లూరుతో మా అనుబంధం ముడిపడివుంది. తిరుపతి జిల్లాలో కొనసాగించడం ప్రజలను తీవ్ర అసంతృప్తికి గురి చేస్తోంది. గూడూరును నెల్లూరు జిల్లాలో విలీనం చేయాలి.

- నల్లారెడ్డి రాజేష్‌రెడ్డి, సర్పంచ్, అరవపాలెం, చిట్టమూరు మండలం

హామీ నెరవేర్చండి



ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నెరవేర్చాలి. గూడూరు ఎన్నో ఏళ్లుగా నెల్లూరుజిల్లాలో భాగంగానే ఉంది. ప్రజల ఆకాంక్షను నెరవేర్చేలా ప్రభుత్వం పునరాలోచన చేసి నెల్లూరులో కలిపేలా చర్యలు తీసుకోవాలి.

- జీ శశికుమార్, సీపీఐ నాయకుడు

నగరి నిర్ణయం తప్పే!

నగరి నియోజకవర్గంలో ఐదు మండలాలుంటే అందులో నగరి, నింద్ర, విజయపురం మండలాలు మూడు చిత్తూరు జిల్లాలోనూ, పుత్తూరు, వడమాలపేట మండలాలు తిరుపతి జిల్లాలోనూ వున్నాయి. నగరి నుంచి చిత్తూరుకు 75 కిలోమీటర్లు కాగా తిరుపతి 60 కిలోమీటర్లు. నింద్ర, విజయపురాల నుంచీ చిత్తూరు 90 కిలోమీటర్లుంటే తిరుపతి 80 కిలోమీటర్లు. చిత్తూరుతో పోలిస్తే తిరుపతి వీరికి చేరువ. రవాణా సదుపాయాలు మెరుగ్గా వున్నాయి. ఈ మూడు మండలాల ప్రజలు విద్య, వైద్య అవసరాలకు చిత్తూరు కంటే తిరుపతిపై ఎక్కువ ఆధారపడుతున్నారు. దీనికి తోడు గత ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు, లోకేశ్, గాలి భానుప్రకాష్.. నగరి నియోజకవర్గాన్ని పూర్తిగా తిరుపతి జిల్లాలో విలీనం చేస్తామని హామీలిచ్చారు. ఆ హామీలను నెరవేర్చక పోవడం పట్ల మూడు మండలాల ప్రజలు తీవ్ర నిరాశకు లోనవుతున్నారు. ప్రజలకు ఏం చెప్పుకోవాలో తెలీక టీడీపీ శ్రేణులు సైతం నైరాశ్యంలో పడ్డాయి.

ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలి



నగరి, పుత్తూరు ప్రాంతాల్లో జరిగిన ఎన్నికల సభల్లో చంద్రబాబు, లోకేశ్, గాలి భానుప్రకాష్ మూడు మండలాలను తిరుపతి జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఓట్ల కోసం హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక తప్పడం దారుణం. హామీ నిలబెట్టుకోవాలి.

- గణేష్ పిళ్లై, విశ్రాంత ఉద్యోగి, నింద్ర

పునఃపరిశీలన చేయాలి



నగరి, నింద్ర, విజయపురం మండలాలను తిరుపతిలో కలపే అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పునఃపరిశీలన చేయాలి. లేకుండా విద్యార్థులకు, ఉద్యోగులకు ఎక్కువ ఇబ్బంది అవుతోంది.

- సమరసింహారెడ్డి, మల్లాకండ్రిగ, విజయపురం మండలం

తిరుపతే అన్నిరకాలుగా సౌకర్యం



నగరి ప్రాంతం తిరుపతికి రైలు సౌకర్యంతో పాటు ప్రతి 15 నిమిషాలకో బస్సు ఉంది. రవాణా సౌకర్యంతో పాటు విద్య, వైద్య సౌకర్యాలు కూడా తిరుపతిలోనే బాగున్నాయి. ఈ మూడు మండలాల ప్రజలకు తిరుపతితోనే అనుబంధం ఉంది. చిత్తూరుకు వెళ్లాలంటే నానా అవస్థలు పడాలి.

- ఈఎస్ శ్రీనివాసులు, కేవీపీఆర్‌పేట, నగరి మండలం

ఎవరడిగారని తిరుపతిలో విలీనం?

నెల్లూరు జిల్లాలో వున్న వెంకటగిరి నియోజకవర్గానికి చెందిన కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలను తిరుపతిలో విలీనం చేయనుండడం పట్ల అక్కడి ప్రజల్లో తీవ్ర అసంతృప్తిని రాజేస్తోంది. వాస్తవానికి ఈ మూడు మండలాల విషయంలో సీఎం చంద్రబాబు గానీ, మంత్రి లోకేశ్ గానీ గత ఎన్నికల్లో ఎలాంటి హామీలూ ఇవ్వలేదు. దానికి తోడు ఈ మూడు మండలాల ప్రజలు గానీ, కూటమి పార్టీల శ్రేణులు గానీ తిరుపతి జిల్లాలో కలపాలని కోరలేదు. ఎలాంటి డిమాండు లేకున్నా నెల్లూరు పరిధిలోని మూడు మండలాలను గూడూరు డివిజన్‌లో కలపడం అక్కడి ప్రజలను విస్మయానికి గురి చేస్తోంది. దూరాభారాల విషయంలో ఈ మూడు మండలాల ప్రజలు ప్రభుత్వ తాజా నిర్ణయంతో తీవ్ర అసౌకర్యానికి గురి కావాల్సి ఉంటుంది. కలువాయి, సైదాపురం, రాపూరు మండలాలు నెల్లూరుకు చేరువగా వున్నాయి. అదే తిరుపతి అయితే రెట్టింపు కంటే ఎక్కువ దూరం. ఉదాహరణకు కలువాయి నుంచి నెల్లూరుకు 70 కిలోమీటర్లు కాగా తిరుపతి ఏకంగా 160 కిలోమీటర్ల దూరంలో వుంది. అలాగే రాపూరు నుంచి నెల్లూరు 60 కిలోమీటర్లు అయితే తిరుపతి 90 కిలోమీటర్లు. సైదాపురం నుంచి నెల్లూరు 50 కిలోమీటర్ల దూరాన వుంటే తిరుపతి ఏకంగా 130 కిలోమీటర్ల దూరంలో వుంది. డివిజన్ విషయంలో కూడా ఈ మండలాలకు గూడూరు కంటే ఇపుడున్న నెల్లూరే చేరువ.

నెల్లూరులోనే కొనసాగించాలి!



నెల్లూరు జిల్లా ఏర్పడినప్పటి నుంచీ అందులోనే ఉన్నాం. నెల్లూరుతో యాస, భాషతో పాటు అన్ని రకాలుగా ప్రత్యేక అనుబంధం ఏర్పడిపోయింది. అలాంటిది ఇప్పుడు విడదీయం తగదు.

- ఇస్కా రమణయ్య, లారీ యజమాని, రాపూరు

మాకు తిరుపతి వద్దు



సైదాపురం మండలాన్ని తిరుపతి జిల్లాలో కలపడం వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులకు గురవుతారు. మాకు అన్ని విధాలా నెల్లూరే అనుకూలం. కాబట్టి నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలి.

- డి.వెంకటేశ్వర్లు, సైదాపురం

రైతులకు కష్టం



కలువాయి మండలం ఇప్పుడు ఆత్మకూరు డివిజన్‌లో ఉంది. కలువాయి నుంచి ఆత్మకూరుకు 50 కిలోమీటర్లు. గూడూరు డివిజన్‌లో కలిపితే 80 కిలోమీటర్లు ప్రయాణించాలి. పనుల మీద తిరిగే రైతులు రానూపోనూ 60 కిలోమీటర్లు అదనంగా ప్రయాణించాలి. జిల్లా కేంద్రం తిరుపతికి పోవాలంటే 160 కిలోమీటర్లు ప్రయాణించాలి.

- నాగిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, సింగిల్‌విండో మాజీ ఛైర్మన్, కలువాయి

పోతురాజు మృతదేహం



అరవింద పాండే మృతదేహం



నేడు సీఎంతో టీటీడీ ఛైర్మన్, ఈవో భేటీ

టీటీడీ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): అమరావతిలో గురువారం సీఎం చంద్రబాబును టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్ కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి కలవనున్నారు. ఇక్కడి వెంకటపాలెంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం ప్రాకారం, కల్యాణోత్సవ మండపం, రాజగోపురం తదితర అభివృద్ధి కార్యక్రమాలకు గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం సీఎంతో వీరు భేటీ అవుతారు. గతంలో సీఎం సూచించిన అభివృద్ధి కార్యక్రమాల పురోగతి, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లు వంటి వివిధ అంశాలపై ఈ సందర్భంగా సీఎం సమీక్షిస్తారు.

15 నుంచీ ప్రి-పీహెచ్‌డీ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 15 నుంచీ ఎస్వీయూలో ప్రి-పీహెచ్‌డీ పరీక్షలు నిర్వహిస్తారు. ఉదయం 9 నుంచీ 12 గంటల వరకూ ఈ పరీక్షలు చేపడతారు. 15 న రీసెర్చ్ మెథడాలజీ, 17 న రీసెర్చ్ టాపిక్ పరీక్షలు నిర్వహించనున్నట్టు సీఈ రాజమాణిక్యం తెలిపారు.

దూరవిద్యా డిగ్రీ మూడో సంవత్సర ఫలితాలు విడుదల

ఎస్వీయూ దూరవిద్యా డిగ్రీ మూడో సంవత్సర ఫలితాలు విడుదలయ్యాయి. ఎస్వీయూ. ఎగ్జామ్. ఎడ్యూ. ఇన్, మనబడి, స్కూల్స్9 వెబ్‌సైట్లలో ఫలితాలను పొందుపర్చినట్టు సీఈ తెలిపారు.

ట్యాంకరు ఎలా పేలింది?

- 'సుధా సోమానీ'లో ప్రమాదంపై అధికారుల దర్యాప్తు
- ఘటనలో ఇద్దరు కార్మికుల మృతి.. మరో ఇద్దరికి గాయాలు

పేలిన ట్యాంకు



శ్రీకాళహస్తి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 'సుధా సోమానీ' పరిశ్రమలో నైట్రోజన్ ట్యాంకరు ఎలా పేలింది.. దీనిపై అధికారులు దర్యాప్తు చేపట్టారు. శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులోని ఈ కర్మాగారంలో బుధవారం నాటి ప్రమాదంలో ఇద్దరు కార్మికులు మృతిచెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. క్రయోజనిక్ ప్రొపైన్ ఖాళీ ట్యాంకులో నైట్రోజన్ నింపుతుంటామని పరిశ్రమ నిర్వాహకులు అధికారులకు వెల్లడించినట్లు తెలిసింది. బుధవారం ఖాళీ ట్యాంకర్‌ను టెస్టింగ్ చేస్తుండగా పేలుడు జరిగినట్లు అధికారులకు వివరించారు. ఖాళీ ట్యాంకర్ అంత అధిక పీడనంతో ఎందుకు పేలిందనే సందేహాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. నైట్రోజన్ ట్యాంకులో నింపుతూ ప్రెజర్‌లో టెస్టింగ్ చేసే సమయంలో అధిక ఒత్తిడి కారణంగా ప్రమాదం జరిగిందా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మరింత లోతుగా దర్యాప్తు చేసి పేలుడు కారణాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

ఏం జరిగింది? : శ్రీకాళహస్తి మండలం వెల్లంపాడులో సుధా సోమానీ సిరామిక్ కర్మాగారంలో టైల్స్, బాత్‌రూం పరికరాలను తయారు చేస్తుంటారు. 50 ఎకరాల విస్తీర్ణంలోని ఈ పరిశ్రమలో సుమారు 500 మంది సిబ్బంది ఉదయం 7 గంటలు, సాయంత్రం 7గంటలకు రెండు షిఫ్టుల్లో పనిచేస్తున్నారు. బుధవారం ఉదయం 11.30గంటల సమయంలో క్రయోజనిక్ ప్రొపైన్ ట్యాంకు పేలడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని వెంకటగిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా చీరాలకు చెందిన పోతురాజు(31), ఒడిశాకు చెందిన అరబింద పాండా(25) మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. చంద్రగిరికి చెందిన బాలాజీ, ఒడిస్సాకు చెందిన సౌభాగ్య నాయక్ అలియాస్ రంజన్ నాయక్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని మెరుగైన చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. మృతుల కుటుంబాలకు రూ.25లక్షలు చొప్పున యాజమాన్యం నష్టపరిహారం చెల్లించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి జనమాల గురవయ్య డిమాండు చేశారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు పటిష్టమైన చర్యలుచేపట్టాలని కోరారు.

పరిశ్రమలో ట్యాంకు పేలిన ప్రదేశం



ప్రమాద స్థలం పరిశీలన : ఈ ప్రమాదం తెలిసిన వెంటనే శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ నాగార్జునరెడ్డి వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకుని క్షతగాత్రులతో మాట్లాడారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం వెంకటగిరి ప్రభుత్వాస్పత్రి మార్చ్యురీకి తరలించారు. అనంతరం డీఎస్పీ సిబ్బందితో కలిసి పరిశ్రమలో ఘటన సంభవించిన ప్రాంతానికి చేరుకుని విచారించారు.ఇంటెలిజెన్స్ స్పెషల్ బ్రాంచి సిబ్బంది పేలిన ట్యాంకర్ పరిసరాలను పరిశీలించారు. తిరుపతి నుంచి క్లూస్ టీం చేరుకుని పేలుడు ప్రదేశంలో మృతుల రక్తపు జాడలు, పల నమూనాలను సేకరించారు.

అధ్యక్షా..

- రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో మన విద్యార్థుల ప్రతిభ



రైతే రాజయ్యేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలను పంపిణీ చేస్తాం. మంతా తుఫానువల్ల వరదలు వచ్చిన ప్రాంతాల్లో తక్షణ సహాయక చర్యలు చేపట్టి నష్టపరిహారం చెల్లించాం.

- వ్యవసాయ శాఖ మంత్రిగా గూడూరు జడ్పీ బాలుర పాఠశాల విద్యార్థి సాగర్ కుమార్.

పుస్తకాల బరువు తగ్గిస్తాం. సెమిస్టర్ సిస్టం అమలు చేస్తాం. పాఠశాలలను డ్రగ్స్‌రహితంగా చేస్తాం. అందుకు అవసరమైన ప్రణాళికను రచించాం.

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా తిరుచానూరు జడ్పీహెచ్ఎస్ విద్యార్థిని చిన్మయి విద్య.



.. ఇలా మన జిల్లాకు చెందిన విద్యార్థులు బుధవారం విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి మాక్ అసెంబ్లీలో మంత్రులుగా వ్యవహరిస్తూ.. తమ వాగ్ధాటితో అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థులపై సోషల్ మీడియా చెడు ప్రభావం పడకుండా ప్రత్యేకంగా రూపొందించిన బిల్లును చిన్మయి ప్రవేశపెట్టారు. ఇక, తిరుపతి నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థిని భవ్యశ్రీ ప్రతిపక్ష సభ్యునిగా.. సైదాపురం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి వెంకట దినకర్ మార్షల్ పాత్ర పోషించారు. కార్యక్రమం అనంతరం వీరిని మంత్రి నారా లోకేశ్ తదితరులు ప్రశంసించారు.

- తిరుపతి(విద్య), ఆంధ్రజ్యోతి

జిల్లా స్థాయిలోనూ మాక్ అసెంబ్లీ

తిరుపతి/తిరుపతి (విద్య), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని తుడా కార్యాలయంలో బుధవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా మాక్ అసెంబ్లీ నిర్వహించారు. నియోజకవర్గాల వారీగా నిర్వహించిన మాక్ అసెంబ్లీ పోటీల్లో ప్రతి నియోజకవర్గం నుంచి ముగ్గురు చొప్పున విజేతలను ఎంపిక చేశారు. అందులో మొదటి బహుమతి పొందిన విద్యార్థులు జిల్లా స్థాయి మాక్ అసెంబ్లీలో పాల్గొన్నారు. మిగిలిన ఇద్దరు విజేతలకు జిల్లా స్థాయిలో మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతలుగా గూడూరు నియోజకవర్గం నుంచి పి.స్పందన (మల్లం), వై.నైనిక (వరగలి).. బద్న (సూళ్లూరుపేట), కె.రాజశేఖర్ (ఎల్‌ఏ సాగరం), ఎం.తనుజ భార్గవి (వెంకటగిరి), ఎం.మునిచరణ్ (పనపాకం), అమాస తేజస్విని (చంద్రగిరి), పట్టం ధనుష్ (తిరుపతి), గౌతమ్ నవీన్ (తంబువాని గుంట), సంగీతం జ్ఞానిక, గుమ్మడి పూజశ్రీ (శ్రీకాళహస్తి), ఎం. కౌశిత (ఇరుగులం), జె. ఇషాంత్ (కల్లివెట్టు) ఎంపికయ్యారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ భారతరాజ్యాంగం పట్ల అవగాహన పెంచుకోవాలని ఇన్‌చార్జి జేసీ, కమిషనర్ ఎన్.మౌర్య సూచించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో స్టేజ్ ఫియర్ తగ్గి, మాట్లాడే నైపుణ్యాలు పెరుగుతాయని డీఈవో కుమార్ తెలిపారు. రాజ్యాంగ విలువలను తెలుసుకోవడం ప్రతి విద్యార్థికి అవసరమని ఏపీసీ గౌరీ శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో సీఎంవో జి.సురేష్, ఏఎస్‌వో చంద్రశేఖర్ నాయుడు, ఏపీవో సుధాకర్ నాయుడు, ఇతర అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఇన్‌చార్జి జేసీ మౌర్య




శైలేష్ కొలను - కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి

కొత్త ప్రాజెక్ట్ కోసం స్వామి ఆశీస్సులు తీసుకున్నా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): త్వరలో కొత్త ప్రాజెక్ట్‌ను ప్రారంభించనున్న క్రమంలో స్వామి ఆశీస్సులు తీసుకున్నానని 'హిట్' సినిమాల దర్శకుడు శైలేష్ కొలను వెల్లడించారు. తిరుమల శ్రీవారిని బుధవారం ఉదయం తన నూతన ప్రాజెక్ట్ స్క్రిప్ట్‌తో ఆయన దర్శించుకున్నారు. సితార ఎంటర్టైన్మెంట్ నాగవంశీతో నూతన సినిమా ప్రారంభంకానుందన్నారు.

● తమిళనాడు తెలుగు యువశక్తి అధ్యక్షుడు, తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్ కౌన్సిల్ అధ్యక్షుడు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి కూడా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

4న తిరుమలలో కార్తీక దీపోత్సవం

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంలో డిసెంబరు 4వ తేది కార్తీక పర్వ దీపోత్సవాన్ని టీటీడీ నిర్వహించనుంది. శ్రీవారికి సాయంకాల కైంకర్యాలు, నివేదనలు పూర్తయ్యాక ఆలయంలోపల, బయట అనుబంధ ఆలయాలు, పుష్కరిణి వద్ద నేతి వత్తులతో దీపాలను వెలిగిస్తారు.


హత్యకేసులో లొంగిపోయిన నిందితుడు

పాకాల, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పాకాల మండలం దామలచెరువుకు చెందిన మామిడి సప్లయర్, మెడికల్ షాప్ యజమాని ఈ యేడాది మే 1వ తేదీన దారుణహత్యకు గురైన సంఘటనలో మూడో నిందితుడు తిరుమల రాజు బుధవారం పాకాల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో లొంగిపోయాడు. న్యాయమూర్తి పూర్ణిమదేవి నిందితుడికి 14 రోజులు రిమాండు విధించారు. ఈ మేరకు పోలీసులు చిత్తూరు సబ్‌జైలుకు నిందితుడిని తరలించారు.

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో, నారాయణగిరిలోని 2 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.26 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,677
తలనీలాలు సమర్పించినవారు: 24,732



కాంచిన కనులదే భాగ్యం



పూలబుట్టలతో ఊరేగింపుగా టీటీడీ అధికారులు



● అమ్మవారికి వేడుకగా పుష్పయాగం

తిరుచానూరు, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జాజులు, తామరలు, మల్లెలు, కలువలు, చామంతి, రోజా, మొల్లలు, కనకాంబరాలు, మొగలి రేకులు తదితర 12 రకాల పుష్పాలు. తులసి, మరువం, దవణం, బిల్వం, కదిర పచ్చ, పన్నీరు తదితర ఆరు రకాల పత్రాలు. వీటితో తిరుచానూరు పద్మావతి అమ్మవారికి బుధవారం అర్చకులు పుష్పయాగం నిర్వహించారు. కార్తీక బ్రహ్మోత్సవాల్లో జరిగిన ఆగమయుక్త కార్యక్రమాల్లో తెలిసో తెలియకో చోటు చేసుకున్న దోషాలకు ప్రాయశ్చిత్తంగా.. ఉత్సవాలు ముగిసిన మరుసటిరోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా దాతల ద్వారా సేకరించిన నాలుగు టన్నుల పుష్పాలు, పత్రాలను గంపల్లో అమర్చి ఆస్థాన మండపంలో పూజలు నిర్వహించారు. ఆలయ ఉద్యోగులు, శ్రీవారి సేవకులు ఈ గంపలను ఊరేగింపుగా ఆలయానికి తీసుకొచ్చారు. మధ్యాహ్నం 3గంటలకు యాగశాలలో ప్రాయశ్చిత, శాంతిహోమం, పూర్ణాహుతి నిర్వహించారు. సాయంత్రం 5గంటలకు సన్నిధి నుంచి అమ్మవారిని వేంచేపుగా శ్రీకృష్ణ స్వామి ముఖమండపంలో కొలువు దీర్చారు. 8గంటల వరకు వేదమంత్రాలు పఠిస్తూ పుష్పాలను అమ్మవారిపై చల్లుతూ పుష్పాభిషేకం చేశారు. ఈ నాలుగు టన్నుల పుష్పాలను ఏపీ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచీ దాతలు వితరణగా అందించినట్టు టీటీడీ ఉద్యానశాఖ అధికారిడిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, ఏఈవో దేవరాజులు, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, అర్చకులు బాబుస్వామి, మణికంఠస్వామి, సూపరింటెండెంట్లు రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, చలపతి, సుబ్బరాయుడు సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టింటి ఆతిథ్యం

పద్మావతీ అమ్మవారికి గురువారం మహంతు ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. బ్రహ్మోత్సవాలు ముగిసిన రెండో రోజు అమ్మవారు తన పుట్టింటికి వెళ్లి ఆతిథ్యం స్వీకరించడంలో భాగంగా పద్మసరోవరం వద్దనున్న హథీరాంమఠంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఉత్సవాన్ని నిర్వహిస్తారు. కాగా, గురువారం నుంచి అమ్మవారి ఆలయంలో యథావిధిగా ఆర్జిత సేవలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నీకొకటి.. నాకొకటి

● అప్పుడు వారు.. ఇప్పుడు వీరు
● రుయాలో రెండు మెడికల్ షాపులను పంచుకున్న నేతలు

తిరుపతి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో మెడికల్ మాఫియాకు బ్రేక్ పడిందని అనుకునేలోపే, పక్కనే ఉన్న రుయాస్పత్రికి విస్తరించింది. రాజకీయ నేతల ఒత్తిళ్లతో బుధవారం రెండు జనరిక్ మెడికల్ షాపులకు అనుమతిస్తూ నోట్‌ఫైల్ సిద్ధమైనట్లు తెలిసింది. ఇరు పార్టీలకు చెందిన ఇద్దరు ప్రజాప్రతినిధులు సిఫారసు లేఖలతో రెండు మెడికల్ షాపులను నామమాత్రపు అద్దెకు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ఏకంగా రుయాలోని స్థలం కేటాయించి గదులను వారినే కట్టుకోమని సూచించినట్టు సమాచారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుయాస్పత్రిలో మెడికల్ షాపులకోసం నలుగురు నాయకుల నుంచి నాలుగు దరఖాస్తులు ఏడాది క్రితమే అధికారులకు అందాయి. ప్రతి ప్రభుత్వ వైద్యశాలలో జనరిక్ మెడికల్ షాపు ఉండాలని, వాటిని రెడ్‌క్రాస్ సొసైటీ మాత్రమే నిర్వహించాలని మే నెలలో రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. దీంతో అధికారులు బయట వ్యక్తులకు కేటాయించలేకపోయారు.

ఇదిలావుంటే 2005లో టెండరు ద్వారా దక్కించుకున్న రెండు ప్రైవేట్ మెడికల్ షాపులు 2019వరకు రుయాకు అద్దెచెల్లిస్తూ నిర్వహించుకుంటూ వచ్చాయి. వైసీపీ అధికారంలోకి వచ్చాక బలవంతంగా ఖాళీ చేయించి, ఆపార్టీ అనుచరులకు కట్టబెట్టారన్న విమర్శలు వచ్చాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కోర్టును ఆశ్రయించి మళ్ళీ వాటిని పూర్వపు నిర్వాహకులే చేజిక్కుంచుకుని ఇటీవల ప్రారంభించారు. ఈ రెండు కాకుండా మరొకటి రెడ్ క్రాస్ సొసైటీ జనరిక్ మెడికల్ షాపు నిర్వహిస్తోంది. జీవో నెంబరు 516 నిబంధనల మేరకు వెయ్యి పడకలు దాటిన ఆస్పత్రిలో మూడు మెడికల్ షాపులు మాత్రమే ఉండాలి. ఆ మేరకు రుయాస్పత్రిలో ప్రస్తుతం 3 మెడికల్ షాపులు ఉన్నాయి. నిబంధనలకు విరుద్ధంగా మరో రెండు షాపులు కేటాయిస్తే రుయాలో మొత్తం 5 మెడికల్ షాపులు ఉన్నట్టు అవుతుంది. రాజకీయ ఒత్తిళ్లను తట్టుకోలేకనే రుయా అధికారులు మెడికల్ షాపులను కేటాయిస్తున్నట్టు తెలుస్తోంది. నిబంధనలకు విరుద్ధంగా అప్పగిస్తున్న మెడికల్ షాపులను హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ ఛైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ అనుమతి తీసుకున్నారా? లేదా? అన్న అనుమానం కలుగుతోంది.

నేడు ప్రముఖ రచయిత్రి ఓల్గా రాక

● తండ్రి పేర పద్మావతి వర్సిటీలో ధర్మనిధి సదస్సు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ తెలుగు విభాగానికి గురువారం ప్రముఖ రచయిత్రి ఓల్గా రానున్నారు. తన తండ్రి పోపూరి వేంకట సుబ్బారావు పేర ఏటా ఏటా ధర్మనిధి సదస్సులో ఆమె పాల్గొంటారు. గురువారం ఉదయం 10 గంటలకు సావేరీ హాల్లో ఈ కార్యక్రమం ప్రారంభం కానుంది.

రైల్వే అధికారి మృతి

తిరుపతి (నేరవిభాగం), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో బుధవారం గుండెపోటుతో రైల్వే అధికారి మృతి చెందారు. తిరుపతి ఈస్ట్ ఎస్ఐ రామాంజనేయులు తెలిపిన ప్రకారం.. ఏర్పేడు మండలం అంజిమేడుకు చెందిన మల్లిఖార్జునరెడ్డి (57)హైదరాబాదులో రైల్వే ఆఫీసు సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. బుధవారం హైదరాబాదు నుంచి తిరుపతికి వచ్చారు. ఈ క్రమంలో రేణిగుంటలో దిగి టీ తాగి బంధువులతో ఫోన్‌లో మాట్లాడాడు. తిరుపతికి బస్సు చేరుకున్నా.. ఎంతసేపటికీ ఆయన దిగలేదు. అనుమానం వచ్చిన బస్సు డ్రైవర్ అతడి వద్దకు వెళ్ళి చూడగా సొమ్మసిల్లి పడి ఉన్నారు. వెంటనే ఆస్పత్రికి తరలించగా, అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని ఎస్ఐ చెప్పారు. జరిగిన ఘటనపై మృతుడు సోదరుడు దశరధరామయ్యకు సమాచారం ఇచ్చారు. అతను ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకు తరలించారు.

సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం

● ఎన్‌సీసీ ఏపీ-టీజీ డీడీజీ నర్సింగ్ సైలాని
● గిరిపురాన్ని దత్తత తీసుకున్న ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఇకపై సామాజిక సేవా కార్యక్రమాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తామని ఎన్‌సీసీ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (డీడీజీ) నర్సింగ్ సైలాని పేర్కొన్నారు. తిరుపతి ఎన్‌సీసీ గ్రూపును బుధవారం ఆయన సందర్శించారు. పచ్చదనం, పరిశుభ్రత వంటి కార్యక్రమాల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొనేలా చేస్తామన్నారు. తద్వారా ఎన్‌సీసీ క్యాడెట్లలో సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాల పెంపు, సామాజిక బాధ్యత అలవడేలా చూస్తామన్నారు. తిరుపతిలోని గిరిపురం ప్రాంతాన్ని ఎన్‌సీసీ తిరుపతి గ్రూపు దత్తత తీసుకుంది. నగరపాలక సంస్థ సహకారంతో పరిశుభ్రత, వ్యర్థాల నిర్వహణపై ఈ ప్రాంతంలోని ప్రజల్లో అవగాహన కల్పిస్తామని సైలానీ తెలిపారు. ఈ సమావేశంలో ఎంసీటీ ఆరోగ్యాధికారి అన్వేష్, ఎన్‌సీసీ అధికారులు సతీష్ దాహియా, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కారు, బస్సు ఢీ ● ఐదుగురికి తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జు అయిన కారు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): పుత్తూరు సమీపంలోని పరమేశ్వర మంగళం వద్ద కారు, బస్సు ఢీ కొన్నాయి. శ్రీకాళహస్తి నుంచి కంచికి వెళుతున్న కారు ఋుఢవాహనాన్ని అధిగమించబోయి కంచి నుంచి తిరుపతికి వస్తున్న తమిళనాడు ఆర్టీసీ బస్సును ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ఐదుగురు ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారికి చిన్నపాటి గాయాలైనట్టు పోలీసులు తెలిపారు. క్షతగాత్రులకు ప్రథమ చికిత్స చేయించి కాంచీపురం ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెప్టిక్‌ట్యాంకు క్లీనింగ్ వాహనానికి దరఖాస్తు చేసుకోండి

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తిరుపతిజిల్లా పరిధిలో మూడు వేల లీటర్ల సామర్థ్యం గల సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ వాహనాన్ని ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్డ్ కులాల సేవాసహకార సంఘం కార్యనిర్వాహక సంచాలకుడు విక్రమ్‌కుమార్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'యూనిట్ విలువ రూ.31,67,326. సబ్సిడీ రూ.14,16,831.50, ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ రుణం రూ.17,50,494.50 ఇస్తున్నారు. జిల్లాలోని ఎస్సీలకు చెందిన సఫాయి కర్మాచారి వృత్తిలో ఉన్న వారు అర్హులు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు పంపాలి. మరిన్ని వివరాలకు 91007 56863 నెంబరులో సంప్రదించాలి' అని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



తిరుమల కొండల్లో ఏనుగుల జాడను గుర్తిస్తున్న వైల్డ్‌లైఫ్ ఇన్‌స్టిట్యూట్ బృందం

'గజ' గమనం పరిశోధిస్తున్నాం

● వైల్డ్ లైఫ్ ఇండియా ప్రాజెక్టు అసోసియేట్ బాలాజీ

మంగళం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ముఖ్యంగా తిరుమల అటవీప్రాంతాల్లో గజరాజులు ఎలా వస్తున్నాయి? ఎక్కడికి వెళుతున్నాయి? అనే దానిపై అధ్యయనం చేయడానికి వచ్చామని వైల్డ్‌లైఫ్ ఇండియా అసోసియేట్ బాలాజీ చెప్పారు. బుధవారం డెహ్రాడూన్ నుంచి ఆరుగురు సభ్యులతో కూడిన బృందం, తిరుపతికి చెందిన ఒక బయాలజిస్టు, ఐదుగురు ప్రొటెక్షన్ వాచర్లు తిరుమల కొండల్లో పర్యటించారు. తిరుమల కొండల్లో నుంచి భాకారపేట, మామండూరు, పరిసర ప్రాంతాల్లోకి ఏనుగులు రాకపోకలు సాగిస్తున్నట్లు గుర్తించారు. ఈ ప్రాంతాల్లో ఉన్న ఏనుగులు.. వీటిలో ఆడ, మగ ఎన్ని? ఎక్కువ కాలం ఏ ప్రాంతంలో ఉంటున్నాయనే అంశాలను అధ్యయనం చేస్తామన్నారు. వీటికి ఆహారం, నీరు లభించే ప్రాంతాలను కూడా పరిశీలిస్తామన్నారు. ఏనుగుల పాదముద్రలు, వాటి విసర్జకాలను కూడాపరిశీలిస్తామని చెప్పారు. ఏనుగుల ట్రాకింగ్‌పై పూర్తి అవగాహన వచ్చాక అటవీప్రాంతాల నుంచి జనంలోకి, పంట పొలాల్లోకి రాకుండా ఎలా నియంత్రించాలనే దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు.

నాలుగు లేబర్‌కోడ్, అగ్రి నల్లచట్టాలు రద్దు చేయాలి

● వామపక్షాలు, రైతు కార్మిక సంఘాల డిమాండ్ ● కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల ఆందోళన



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాల నాయకులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్, మూడు వ్యవసాయ నల్ల చట్టాలను రద్దు చేయాలని వామపక్షాలకు చెందిన కార్మిక సంఘాలు డిమాండ్ చేశాయి. కలెక్టరేట్ వద్ద బుధవారం ఏఐటీయూసీ, సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ, రైతు సంఘాలు ఆందోళన నిర్వహించాయి. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఐ ఎంఎల్ నగర కార్యదర్శి వెంకటరత్నం మాట్లాడుతూ ఎప్పుడో పార్లమెంట్‌లో ఆమోదించిననాలుగు లేబర్ కోడ్‌ను అమలు బిహార్ ఎన్నికల తర్వాత అమల్లోకి వస్తాయని ఆర్డినెన్సు విడుదల చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ నల్లచట్టాల రద్దుకోసం ఉద్యమించిన రైతాంగానికి క్షమాపణ చెప్పి ఉపసంహరించుకుంటామన్న ప్రధాని మోదీ.. ఇప్పుడా మాట విస్మరించారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోనూ పదిగంటలకుపైగా పనిచేయించుకోవచ్చని అసెంబ్లీలో తీర్మానం చేయడం దుర్మార్గమని ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్‌రెడ్డి, జయచంద్ర పేర్కొన్నారు. ఈ ఆందోళనలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు హేమలత, ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి చిన్నం పెంచలయ్య, వివిధ కార్మిక సంఘాల నేతలు విజయకుమార్, రాజా, రవి, వేణుగోపాల్, రాధాకృష్ణ, సాయిలక్ష్మి, గంగ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతలో పాడిపరిశ్రమది కీలక భూమిక

● జాతీయ పాలదినోత్సవంలో వెటర్నరీ వీసీ జేవీ రమణ



తిరుపతిరూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతలో పాడిపరిశ్రమరంగం కీలక భూమిక పోషిస్తోందని ఎస్వీ వెటర్నరీ వర్సిటీ ఇన్‌చార్జి వీసీ జేవీరమణ పేర్కొన్నారు. శ్వేతవిప్లవ పితామహుడు డాక్టర్ వర్గీస్ కురియన్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ డెయిరీ అసోసియేషన్ ఏపీ లోకల్ చాప్టర్, డెయిరీ టెక్నాలజీ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన జాతీయ పాలదినోత్సవంలో ఆయన మాట్లాడారు. దేశంలో పాడి పరిశ్రమ అభివృద్ధి, మహిళాసాధికారితలో కురియన్ సేవలు మరువలేనివన్నారు. చిత్తూరుజిల్లా కుప్పం మండలం, గరిగచ్చినీపల్లెకి చెందిన చంద్రశేఖర్ నాగజ్యోతిని ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ద్వారా ఉత్తమ మహిళా పాడిరైతుగా ఎంపిక చేసి రూ.10వేల నగదు, సర్టిఫికెట్‌తో సన్మానించారు. అలాగే నగరంలోని అగ్రికల్చర్, వెటర్నరీ, డెయిరీ టెక్నాలజీ, ఎస్వీఆర్ట్స్ కళాశాల, పద్మావతి మహిళా వర్సిటీ విద్యార్థులకు పాల ఉత్పత్తిదారులకు మెరుగైన రాబడిని నిర్ధారించడం అనేఅంశంపై వక్తృత్వపోటీలు నిర్వహించారు. తొలిమూడుస్థానాలు సాధించిన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఐడీఏ-ఏపీలోకల్ చాప్టర్ ఛైర్మన్ డాక్టర్ రవికుమార్, డెయిరీటెక్నాలజీ డీన్, లోకల్ చాప్టర్ కార్యదర్శి డాక్టర్ కె.నాగేశ్వరరావు, అసోసియేట్ డీన్ డాక్టర్ జి.గంగరాజు, డాక్టర్ మంజునాథ, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను పాటించని వాహనదారులకు రూ.3.17 లక్షల జరిమానా

తిరుమల, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులకు బుధవారం అధికారులు రూ.3.17 లక్షల జరిమాన విధించారు. తిరుపతి రవాణాశాఖ, ట్రాఫిక్ అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి తిరుమల మొదటి, రెండవ ఘాట్‌రోడ్లలో బుధవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించని వారితో పాటు డ్రైవింగ్ లైసెన్స్, సరైన వాహనాల పత్రాలు లేని వారికి 105 చలానాల ద్వారా రూ.3.17 లక్షల జరిమాన విధించారు. నిత్యం రద్దీతో కూడిన తిరుమల క్షేత్రానికి వచ్చేవెళ్లేవారందరు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని అధికారులు సూచించారు. ఈ దాడుల్లో ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, రవాణశాఖ అధికారులు శ్రీనివాసులు, అధిక నాజ్, స్వర్ణలత, వెంకటరమణ, అంజనేయప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పుత్తూరులో తండ్రిపై కూతురు కిడ్నాప్ కేసు

పుత్తూరు అర్బన్, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): తనతో పాటు తన భర్తను కిడ్నాప్ చేయబోయాడని తండ్రిపై కూతురు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు తండ్రి చంద్రబాబుపె పోలీసులు కిడ్నాప్ యత్నం కేసు నమోదు చేశారు. కల్యాణపురానికి చెందిన చంద్రబాబు పశు వైద్యుడు. కుటుంబ సమేతంగా కార్వేటినగరంలోని చర్చికి వెళ్లి ప్రార్థనలు నిర్వహించే వారు. ఈ క్రమంలో పవిత్ర ఎస్ఆర్‌పురం మండలం పొదలపల్లికి చెందిన గిరిప్రసాద్‌ను రెండు నెలల క్రితం తల్లిదండ్రుల సమ్మతి లేకుండా వివాహం చేసుకుంది. ఈక్రమంలో తల్లికి బాగాలేదని పవిత్రను పిలిపించిన చంద్రబాబు... గిరిప్రసాద్‌ను కార్వేటినగరంలో రోడ్డులోని ఎస్ఎస్ బేకరి వద్ద నెంబర్ ప్లేట్ లేని కారులో తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పెనుగులాట జరిగి, కారు నుంచి బయటపడిన పవిత్ర, గిరిప్రసాద్ పుత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

జంతు మార్కెట్ యాప్ ఆవిష్కరణ



యాప్‌ను ప్రారంభిస్తున్న వీసీ నరసింగరావు తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఇంజినీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ నాలుగో సంవత్సర విద్యార్థి ఎం.పూర్ణప్రసాద్ రూపొందించిన జంతు మార్కెట్ యాప్‌ను వీసీ నరసింగరావు, రెక్టార్ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు బుధవారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. పూర్ణచంద్ రూపొందించిన యాప్ ద్వారా జంతువులు, పశుగ్రాసం, పాల ఉత్పత్తులు, కూరగాయలు, పండ్లు, పంట ఉత్పత్తుల కొనుగోలు అమ్మకం, రైతులు పశు వైద్యులను సంప్రదించడానికీ, టీకా రిమైండ్ చేయడానికీ, పశువుల ధర వంటి వివరాలు పొందుపర్చినట్టు చెప్పారు. ఈ యాప్ రూపొందించడంలో ప్రొఫెసర్ వివేకానంద రెడ్డి మార్గదర్శకత్వం వహించారు. సీడీసీ డీన్ చెంద్రాయుడు, రీసెర్చ్ డీన్ నరసింహ, ప్రిన్సిపాళ్ళు శ్రీనివాసులు, సుధారాణి, వెంకటేశ్వర్లు, పద్మావతి పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో రాజ్యాంగ దినోత్సవం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న అధికారులు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం 76వ భారతరరాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్ర రెడ్డి, రోజ్మాండ్‌తో పాటు సుధారాణి, శివశంకర్‌నాయక్, కలెక్టరేట్ ఏవో రమేష్ బాబు, తహసీల్దారు శిరీష తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైతుల అభ్యున్నతికి పంచసూత్రాలు: కురుగొండ్ల



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

డక్కిలి, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): రానున్న ఐదేళ్లలో రైతులు అభ్యున్నతి సాధించేలా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పంచసూత్రాలు అమలు చేస్తున్నరని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. బుధవారం డక్కిలి మండలం తీర్థంపాడు గ్రామంలో నిర్వహించిన రైతన్నా మీసేవలో... మన మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. వెంకటగిరి నియోజకవర్గంలో వరి సాగు అధికంగా ఉండటంతో యూరియా సరఫరా విషయంలో ప్రభుత్వాన్ని అప్రమత్తం చేసినట్లు వెల్లడించారు. ధాన్యం విక్రయించిన 48 గంటల్లో రైతుల ఖాతాలో నగదు జమ చేస్తున్న ఘనత టీడీపీ ప్రభుత్వానిదేనన్నారు. ఎన్నికల హామీ మేరకు అన్నదాత సుఖీభవ కింద ఏడాదికి రూ.20వేలు చొప్పున రైతులకు ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. రైతులు ముందుకు వస్తే ఎంఎస్ఎంఈ కింద పరిశ్రమలు స్థాపించేందుకు ప్రభుత్వం సాయం అందిస్తామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ జేడీ ప్రసాద్‌రావు, ఏవో శిరీషా, ఎంపీడీవో రవీంద్రబాబు, నాయకులు పోలంరెడ్డి కోటేవ్వరెడ్డి, ఏలేశ్వరం రామచంద్ర నాయుడు, అయ్యప్పరెడ్డి, రాజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నెలవల ముందస్తు జన్మదిన వేడుకలు



నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ముందస్తు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో బుధవారం రాత్రి ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో నెలవల సుబ్రహ్మణ్యం జన్మదిన వేడుకలు నిర్వహించారు. టీడీపీ నాయకులు పొట్లపూడి రాజేష్, ప్రసాద్ నాయుడు, సంచి కృష్ణయ్య, మనవాలి శ్రీనివాసులు, బాబు, పార్థసారధి, నరేంద్ర, చేవూరి చెంగయ్య, భాస్కర్, రాజు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి సందర్భంగా గంగా పార్వతీ సమేత నాగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీవల్లీ, దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కల్యాణ వేదిక ఏర్పాటు చేసి స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ కుమార్ శర్మ ఆధ్వర్యంలో వేదపండితుల మంత్రోచ్చరణ నడుమ కల్యాణాన్ని నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కల్యాణాన్ని తిలకించారు. పర్వతరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కవిత దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు. పాలకమండలి అధ్యక్షుడు ఆదినారాయణరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

స్కంద షష్ఠి మహోత్సవం



స్వామికి అమ్మవార్లకు శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

చిట్టమూరు, నవంబర్ 26(ఆంధ్రజ్యోతి): చిట్టమూరు మండలం మల్లాంలోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్కంద షష్ఠి మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అరుణోదయ కాలపూజ, విఘ్నేశ్వర పూజ, స్నాపన పుణ్య హవచనం నిర్వహించారు. అనంతరం స్వామివారికి పాలాభిషేకం చేశారు. శాంతి కల్యాణం జరిపారు. రాత్రి పల్లకిసేవ, గ్రామోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కామిరెడ్డి మునిశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నిజాయితీ చాటుకున్న ఆటో డ్రైవర్



బంగారు ఆభరణాన్ని బాధితురాలికి అందజేస్తున్న ఆటో డ్రైవర్ శ్రీనివాసులు

గూడూరు అర్బన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఓ మహిళ ఆటోలో మరిచిపోయిన బంగారు ఆభరణాన్ని తిరిగి అందజేసి ఓ ఆటో డ్రైవర్ నిజాయితీని చాటుకున్నాడు. చిల్లకూరు మండలం చింతవరం గ్రామానికి చెందిన సుబ్బమ్మ గూడూరుకు వచ్చేందుకు ఆటో ఎక్కింది. అయితే ఆ ఆటో బయలుదేరడం ఆలస్యం కావడంతో మరో ఆటో ఎక్కే క్రమంలో తన సంచిని మరిచిపోయింది. అందులో బంగారు ఆభరణం ఉండడంతో శ్రీనివాసులు గూడూరు మార్కెట్ సమీపంలోని ఆటో స్టాండు వద్దకు వచ్చి అక్కడి డ్రైవర్లు అంకయ్య, పెంచలయ్య సాయంతో బాధితురాలు సుబ్బమ్మను గుర్తించి ఆమెకు బంగారు ఆభరణం ఉన్న సంచిని అందజేశాడు. ఆటో డ్రైవర్ శ్రీనివాసులుకు సుబ్బమ్మ కృతజ్ఞతలు తెలియజేసింది.

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టడం జరిగిందని ఏపీసీసీ కార్యదర్శి సుధారామ కృష్ణన్, మాజీ ఎంపీ చింతా మోహన్ అన్నారు. బుధవారం స్థానిక మసీదువీధిలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. బాలగురవం బాబు, చంద్రశేఖర్, రామకృష్ణారావు, గోపి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష వద్దు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆధునిక సమాజంలో లింగ వివక్ష హేయమైన చర్య అని తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, వెలుగు ఏపీఎం అనీల అన్నారు. కోటలోని వెలుగు, మండల పరిషత్ కార్యాలయాల ప్రాంగణాల్లో బుధవారం లింగ సమానత్వంపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మన్నెముత్తేరి 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్ మలి విడత పనుల కారణంగా గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శేఖర్ తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని ఇసుకమిట్ట, వన్నెముత్తేరి, బాపూజీ కాలనీ, డేగలపాలెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

రైల్వేగేటు మూసివేత

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణంలోని కచ్చేరివీధిలో ఉన్న ప్రధాన రైల్వే గేటును ఎల్‌సీ-60 మరమ్మతుల కారణంగా గురువారం మధ్యాహ్నం 2 గంటల నుంచి శుక్రవారం రాత్రి 11 గంటల వరకు మూసివేయనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

రేపు ప్రజాదర్బార్

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 28వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ తెలిపారు. ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ విచ్చేసి ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్: మహిళకు గాయాలు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని విద్యానగర్ కొత్తపాళెం రోడ్డు వద్ద బుధవారం బైక్‌ను టిప్పర్ ఢీకొన్న సంఘటనలో సుజన అనే మహిళ గాయపడింది. చిల్లకూరు మండలం తల్లమాలకు చెందిన సుజన కుమారుడితో కలిసి బైక్‌లో విద్యానగర్ సెంటర్‌కు వెళ్తుండగా వెనుక నుంచి టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో సుజనకు గాయాలవడంతో కోట ఆస్పత్రికి తరలించారు.



మంగళంపాడు చెరువులో నిర్మాణంలో ఉన్న ఎస్ఎస్ ట్యాంకు - చెరువును ఆనుకుని చెత్త వేసిన దృశ్యం

ఎస్ఎస్ ట్యాంకు పక్కన డంపింగ్ యార్డు?

మంగళంపాడు చెరువు సమీపంలో స్థల పరిశీలన ● వ్యతిరేకిస్తున్న గ్రామస్తులు

సూళ్లూరుపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం అధికారులు తాజాగా పరిశీలించిన స్థలం వివాదాస్పదమవుతోంది. సూళ్లూరుపేట పట్టణానికి తాగునీరందించేందుకు రూ.169 కోట్లు ఏఐబీ నిధులతో మంగళంపాడు చెరువులో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని గత టీడీపీ ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం మంగళంపాడు చెరువు పక్కనే ఉన్న సర్వే నెంబరు 2లో 90 ఎకరాలు, సర్వే నెంబరు 3లో 70 ఎకరాలు(మొత్తం160) ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణానికి పంచాయతీ తీర్మానం ద్వారా అప్పగించారు. పనులు కూడా 60 శాతం పైగా జరిగాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో బిల్లుల చెల్లింపులో జాప్యం జరగడంతో పనులు ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం కొలువు దీరాక మళ్లీ యూడీఎఫ్ నిధులు కేటాయించి టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేసింది. త్వరలోనే పనులు ప్రారంభించి మార్చి నాటికి తాగునీరందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇదిలా ఉండగా సమ్మర్ స్టోరేజ్ నిర్మాణం జరుగుతున్న చెరువును ఆనుకొనే డంపింగ్ యార్డు ఏర్పాటుకు అధికారులు గుట్టుచప్పుడు స్థల పరిశీలన చేయడం వివాదాస్పదమవుతోంది. పట్టణంలో రోజుకు 23 మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ప్రస్తుతం జాతీయ రహదారి ఆనుకుని కాళంగి నది ఒడ్డున ఉన్న డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు ప్రయత్నాలు చేపట్టారు. పలుచోట్ల స్థలాలను పరిశీలించి మూడు నెలల క్రితం కొణ్ణంబట్టు వద్ద పది ఎకరాలు భూమిని కేటాయించారు. సమీప గ్రామస్తుల నుంచి వ్యతిరేకత రావడంతో సమస్య మొదటికొచ్చింది. చివరికి ఎస్ఎస్ ట్యాంక్ పక్కన డంపింగ్ యార్డు ఏర్పాటు చేసేందుకు అధికారులు గుట్టుచప్పుడు కాకుండా స్థల పరిశీలన చేశారు. ఈ విషయం గ్రామస్తులకు తెలియడంతో ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాలిటీ తాగునీటి పథకానికి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేడయం ఏంటని, పంచాయతీలో తీర్మానం లేకుండా, గ్రామస్తులకు సమాచారం ఇవ్వకుండా ఎలా నిర్ణయం తీసుకుంటారంటూ తహసీల్దార్ గోపినాథరెడ్డిని ప్రశ్నించారు. ఈ విషయం ప్రజారోగ్యశాఖ అధికారులకు తెలియడంతో సమ్మర్ స్టోరేజ్ ఉన్న ప్రదేశానికి 600 మీటర్ల దూరం వరకు డంపింగ్ యార్డు ఏర్పాటు చేయకూడదని స్పష్టం చేసినట్లు సమాచారం.

రాజ్యాంగంతో అందరికీ సమన్యాయం



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జడ్జి వెంకట నాగపవన్ కుమార్, న్యాయవాదులు

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశంలో అందరికీ సమన్యాయం చేకూరాలనే ఉద్దేశంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అందించారని ఏడవ అదనపు జిల్లా జడ్జి వెంకట నాగపవన్‌కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యాంగ దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినం నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి సులోచనా రాణి, న్యాయవాదులు కొత్తపల్లి వసంతకుమార్, అరవ పార్వతయ్య, మెహబూబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

తడ: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం జరిగింది. విద్యార్థుల చేత మాక్ పార్లమెంట్‌ను నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం పోటీలను నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవోలు వేములు, మల్లికార్జనరావు, న్యాయవాది శ్రీనివాసులు, జనవిజ్ఞాన వేదిక నాయకులు చెంగయ్య, రామమూర్తి, ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ కొలవి రఘురెడ్డి, ఎంపీడీవో శేఖర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట: పట్టణంలోని జనసేన కార్యాలయంలో నియోజవర్గ ఇన్‌చార్జి, ఏఎంసీ ఛైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు అట్ల కృష్ణారావు, గిండి సతీష్, బాలు, శ్రీను, ఉపేంద్ర, మహేంద్ర, రోహిణి, సల్మ, వైష్ణవి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఛైర్మన్ ఆకుతోట రమేష్ ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఉపాధ్యక్షుడు రవీంద్రారెడ్డి, కార్యదర్శి రామమ్మ, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఓజిలి: స్థానిక స్త్రీశక్తి భవనంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఎంపీడీవో నారాయణ రెడ్డి, తహసీల్దార్ పద్మావతి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏపీఎం పద్మ, సీసీలు సిబ్బంది పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని బంగారుపేట, మోడల్ స్కూల్, జడ్పీ ఉన్నత పాఠశాలల్లో రాజ్యంగ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు మాక్ పార్లమెంట్, క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ తులసిజ్యోతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిల్లకూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చిట్టమూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమా మహేశ్వరరావు ఆధ్వర్యంలో రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

కోట: తహసీల్దారు, మండల పరిషత్, ఎంఈవో కార్యాలయాల్లో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు జరిగాయి. తహసీల్దారు జయజయరావు, ఎంపీడీవో దిలీప్‌కుమార్ నాయక్, ఎంఈవో మస్తానయ్య తదితరులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: విజయశ్రీ



రైతులకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ

నాయుడుపేట టౌన్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ అన్నారు. మండలంలోని కూచివాడ గ్రామంలో బుధవారం రాత్రి రైతన్నా సేవలో మన మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని టీడీపీ మండల అధ్యక్షుడు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూచివాడ గ్రామంలో అన్నదాత సుఖీభవ పథకం కింద 240 మంది రైతుల ఖాతాలో రూ.24 లక్షలు జమ అయినట్లు తెలిపారు. ఇప్పటికే నియోజకవర్గంలో రెండో కోటా కింద యూరియా అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్, వెటర్నరీ ఏడీ గోవర్ధన్‌రెడ్డి, ఏవో గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీరాంప్రసాద్, నాయకులు కరుణాకర్‌రెడ్డి, రత్నయ్య, కట్టా వెంకటరమణారెడ్డి, యేసుదాసు, రైతులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎన్ఎంయూఏ నాయకులు అన్నారు. బుధవారం స్థానిక డిపో వద్ద నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా డిపోల్లో కండక్టర్లు, డ్రైవర్ల నూతన చార్ట్‌లను ప్రవేశపెట్టాలన్నారు. కార్మికుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే డిపోల్లో రెస్ట్ రూమ్‌ల వద్ద మెరుగైన సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్కే అహ్మద్, ప్రవీణ్, వెంకయ్య, శ్రావణ్‌కుమార్, వెంకటేశ్వర్లు, బాషా, బాబురావు, కృష్ణయ్య, హుస్సేన్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై శిక్షణ

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం క్లీన్ అండ్ గ్రీన్ విలేజ్‌పై గ్రామ సమాఖ్య సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులకు శిక్షణ ఇచ్చారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాలి

గూడూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్మిక వర్గాన్ని బానిసలుగా మార్చే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టవర్‌క్లాక్ సెంటర్ వద్ద సీఐటీయూ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్‌కోడ్లు రాజ్యాంగ విరుద్ధం అని అన్నారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసం కేంద్రం ఈ లేబర్‌కోడ్లను తీసుకువచ్చిందని విమర్శించారు. కార్యక్రమంలో శివకుమార్, ప్రభాకర్, బీవీరమణయ్య, శశికుమార్, మణి, నారాయణ, రమేష్, సునీల్, ప్రసాద్, చంద్రయ్య, శివకుమార్, నాగరాజు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ

వెంకటగిరి టౌన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బంగారుపేట పాఠశాలలో మధ్యాహ్నం భోజనాన్ని ఎంఈవో-2 బాబయ్య బుధవారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం నాణ్యతతో కూడిన భోజనం అందించాలని సూచించారు.

మార్పు కోసం ముందడుగు

తడ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ చైతన్యవంతురాలై మార్పు కోసం ముందడుగు వేయాలని, లింగ వివక్షతను రూపుమాపాలని ఎంపీడీవో శేఖర్ నాయక్ అన్నారు. బుధవారం అంతర్జాతీయ స్త్రీహింసా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మహిళా సదస్సు జరిగింది. ఎంపీపీ రఘురెడ్డి, ఏపీఎం రాజారెడ్డి, అధికారులు, పాల్గొన్నారు.

స్టేట్ బ్యాంక్‌లో తనిఖీలు

కోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కోట క్రాస్ రోడ్డులోని స్టేట్‌బ్యాంక్‌లో రీజనల్ మేనేజర్ స్వామి బుధవారం తనిఖీలు నిర్వహించారు. లావాదేవీలు, రుణాల మంజూరు, రికవరీకి సంబంధించిన రికార్డులను పరిశీలించారు.

నేడు కెమికల్ మాక్ ఎక్సర్‌సైజ్

గూడూరు అర్బన్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళపూరు గ్రామంలో గల కలర్‌షైన్ పరిశ్రమలో గురువారం రాష్ట్ర విపత్తుల నివారణ సంస్థ ఆధ్వర్యంలో కెమికల్ మాక్ ఎక్సర్‌సైజ్ నిర్వహించనున్నట్లు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు.